

రాగన్నపట్టెడలో శిథిలావస్థలో బడి భవనం

నాడు-నేడు నిధులు వెనక్కి

సూళ్లూరుపేట మండలం రాగన్న పటెడ జడ్పీ ఉన్నత పాఠశాలలోని రెండు భవనాలు మరమ్మతులకు గురై వినియోగించడంలేదు. నాడు-నేడు కింద రూ.1.40కోట్లు మంజూరైనా పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ప్రస్తుతం నాలుగు గదుల్లోనే మూడు నుంచి 10 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ లేదు. వంటశాలకు గది కూడా నిర్మించలేదు.

● మంగళంపాడు హైస్కూల్‌కు గతేడాది తుపాన్ ప్రభావంతో ప్రహరీ కూలిపోయింది. ఇప్పటివరకు గోడను నిర్మించలేదు.

వెక్కిరిస్తున్న బడులు

● పెళ్లకూరు మండలంలో ఏడు ఉన్నత, 58 ప్రాథమిక పాఠశాలలగాను కొత్తూరు, తాళ్వాయిపాడు మెయిన్, ఏడబ్ల్యూ, పెళ్లకూరుమిట్ట ప్రాథమిక బడులు మినహా తక్కినవన్నీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. చెన్నప్పనాయుడుపేట ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. అదనపు తరగతి నిర్మాణం పునాదుల్లోనే నిలిచిపోయింది.

● కొత్తూరు పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకొని పెచ్చులూడి పడుతున్నాయి. ప్రహరీ లేదు. చెంబడిపాలెం గిరిజన కాలనీ పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడుతోంది. ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతింది. మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు.

● జంగాలపల్లి పాఠశాల భవనంతో పాటు టాయిలెట్ సౌకర్యం లేదు. పెరుమాళ్లపల్లెలో టాయిలెట్ సౌకర్యం లేదు. శిరసనంబేడు రాజుపాలెం, బంగారంపేట, లక్ష్మీనాయుడు కండ్రిగ, ముమ్మారెడ్డిగుంట పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి.



చెంబేటిపాళెం పాఠశాల దుస్థితి

ఆంధ్రజ్యోతి విజిట్

బడులు ఎక్కడ

బాగుచేశావు జగన్?

'నాడు-నేడు' అంటూ గొప్పలు తప్ప అంతా డొల్లే

మౌలిక వసతులు లేక విద్యార్థుల ఇక్కట్లు

కూటమి ప్రభుత్వమైనా దృష్టిపెట్టాలి

పగుళ్లుబారిన గోడలు. పెచ్చులూడిన పైకప్పులు. ప్రహరీ లేక భద్రత కరువైన బడులు. కంపు కొట్టే బాత్రూములు. మూత్రశాలలు లేకుండా బయటకు పరుగులు తీసే విద్యార్థులు. అందుబాటులో లేని తాగునీళ్లు. ఇవీ 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో కనిపించిన సర్కారు స్కూళ్ల దుస్థితి. కార్పొరేట్ స్థాయిలో సర్కారు బడులను తీర్చిదిద్దామన్న గత వైసీపీ ప్రభుత్వ మాటలు డొల్లగానే కనిపిస్తున్నాయి. జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. కూటమి ప్రభుత్వమైనా వీటిల్లో వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

తడ మండలం బీవీ పాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రహరీగోడ కొంత మేరకు దెబ్బతింది. ఆర్వోప్లాంట్, బోరు పనిచేయడం లేదు. పంచాయతీ నీటితో ట్యాంకులను నింపుకొని వాడుకొంటున్నారు.



బీవీపాలెంలో దెబ్బతిన్న పాఠశాల ప్రహరీ



ఎన్టీఆర్ కాలనీలో శిథిలావస్థకు చేరుకున్న కమ్యూనిటీ భవనంలో నడుస్తున్న పాఠశాల

పాములు, తేళ్ల మధ్య పాఠాలు

● కోట మండలం ఎన్టీఆర్ కాలనీలో శిథిలావస్థకు చేరుకొని ఉన్న కమ్యూనిటీ హాలులో ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. పదేళ్ల కిందట పాఠశాల మంజూరైనప్పటికీ ఇప్పటివరకు భవనం లేదు. కమ్యునిటీ హాలుకు ప్రహరీ లేక పోవడం, చుట్టూ ముళ్ల చెట్ల వల్ల పాములు, తేళ్లు బడిలోకి వచ్చి విద్యార్థులను భయపెడుతున్నాయి. వర్షమొస్తే ఉరుస్తోంది.

● వాకాడులో ప్రహరీ లేని పాఠశాలలు అనేకం ఉన్నాయి. చీమలపాడు, నిడుగుర్తి, చిన్నతోట, నవాబ్ పేట, మొనపాళెం, నలగాముల, మూలపడవ, పంబలి స్కూల్స్ అధ్వానంగా ఉన్నాయి.

ఆరుబయట చదువులు

● అవిలాల వేదాంతాపురం మండల ప్రాథమిక పాఠశాలకు గత వైసీపీ ప్రభుత్వంలో నాడు నేడు రెండో విడత కింద ఎంపికైంది. నాగరత్నమ్మ కాలనీలో కొత్త భవన నిర్మాణాలు చేపట్టారు. మొత్తంగా రూ.17 లక్షలు మంజూరు చేశారు. స్లాబ్, ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేసారు. తలుపులతో పాటు కొన్ని పనులు చేయాలి. దీంతో పాత భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. డెస్క్‌లు లేకపోవడంతో ఆరు బయట, చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు

● చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయతీలోని వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాల చిన్నపాటి వర్షానికి ఉరుస్తోంది. జంగామాండ్లపల్లిలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్నారు.

● పాకాల ఉన్నత పాఠశాలలో డెస్కులు లేక నేలపైనే కూర్చుంటున్నారు. మరుగుదొడ్లు అరకొరగా ఉన్నాయి. తరగతి గదులు అధ్వానంగా ఉండటంతో నాబార్డు నిధులు రూ.రెండు కోట్లు మంజూరైనా పనులు దశలో దశలోనే ఉన్నాయి. నాడు- నేడు పథకంలో రూ.1.90 లక్షలు మంజూరైనా 20 శాతం పనులు కూడా జరగలేదు. ఆర్సీపురం మండలం దేశూరికండ్రిగలో పాఠశాల భవనం దెబ్బతింది.

పశువులు, పందుల సంచారం

● గూడూరు మండలం చవటిపాళెంలోని సర్కారు బడిలో సుమారు 340 మంది చదువుకుంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో బయట వ్యక్తుల వాహనాలు, ఇతరులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆవరణంలో పశువులు, పందుల సంచారంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

● చిల్లకూరులోని శంకరన్ గిరిజన కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేదు. బడి వెనుక పిచ్చి మొక్కల వల్ల విషపురుగుల భయం వెన్నాడుతోంది. బాలాయపల్లి మండలంలో జయంపు, వెంగమాంబపురం ఉన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి.



నాగలాపురం మండలం గోళ్లవారి కండ్రిగలో..

అంతా ప్యాచ్ వర్క్

● నాగలాపురం మండలంలోని గోళ్లవారికండ్రిగ పాఠశాలకు నాడు-నేడు కింద నిధులు మంజూరైనా..చిన్నచిన్న రిపేర్లు చేసి చాలావరకు బిల్లులు స్వాహా చేశారన్న విమర్శలున్నాయి. చాలా అధ్వాన్నంగా స్కూల్ భవనం ఉంది. పైకప్పులు పెచ్చులూడిన చోట సిమెంట్‌తో కవర్ చేశారు. ● పుత్తూరు మండలం కల్యాణపురం ప్రాథమికోన్నత పాఠశాల కోసం నాడు-నేడు కింద చాకలి గుంటలో రూ20లక్షలతో పునాదులు వేసి నిలిపేశారు. పాతభవనంలో విద్యార్థుల సంఖ్యకు తగినంత గదులు లేక ఇబ్బందిపడుతున్నారు. రెప్పాలపట్టు యానాది కాలనీ ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్ సగం పనులతో ఆగిపోయింది. బాత్రూం దారుణంగా ఉంది. పాఠశాల చుట్టూ రాళ్ల రప్పలతో దర్శనమిస్తోంది.

ఇరకంలోనూ ఇక్కట్లే

ఇరకం దీవిలోని ప్రాథమిక పాఠశాలలో ఇప్పుడు ఆరుగురు విద్యార్థులు ఉండగా ఒక రెగ్యులర్ ఉపాధ్యాయుడు ఉన్నారు. ఇక, ఇరకం దీవిలోని పాళెంతోపుకుప్పం (ఇరకం కుప్పం) ప్రాథమిక పాఠశాలను తమిళ మాధ్యమం పాఠశాలగా 2019 ఆగస్టులో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కనెలలోనే మూతపడి, కేవలం ప్రాథమిక పాఠశాలగా కొనసాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు విద్యార్థులు ఉండగా ఒక సీఆర్ఎంటి(క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్) ఉన్నారు. కాగా, ఇరకం దీవిలోని ప్రజలకు తమిళ భాషపై మక్కువ ఎక్కువ. ఈ పాఠశాలలో సరైన విద్య అందకపోవడం, రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇక్కడ విద్యార్థులు తమిళనాడు పాఠశాలకు వెళుతున్నారు. అదికూడా నాటు పడవల్లో పులికాట్ సరస్సులో 8 కిలోమీటర్లు ప్రయాణించి చదువుకుంటున్నారు.

మిగిలింది ఐదుగురే



ఇది వడమాలపేట మండలం తట్నేరిలోని బడి ఇది. గతంలో 20మందికి పైగా చదువుకునే వారు. వైసీపీ ప్రభుత్వం 117 జీవోతో 3, 4, 5 తరగతులు సమీపంలోని పాదిరేడు ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనమయ్యాయి. దీంతో ఐదుగురే మిగిలారు. ఇక్కడ రెగ్యులర్ టీచరు ఉన్నారు.



బీఎన్ కండ్రిగలో అఘోరితో మాట్లాడుతున్న సీఐ

పంతం వీడి.. వస్త్రాలు ధరించి..

● శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న అఘోరి

శ్రీకాళహస్తి/బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దిగంబరంగానే శివుడ్ని దర్శించుకుంటానని గురువారం ఉదయమంతా ఆగడం చేసిన అఘోరి.. సాయంత్రానికి పంతం వీడి వస్త్రాలు ధరించి ఆలయానికి వచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద దిగంబరంగా వెళ్లిన అఘోరిని అధికారులు అడ్డుకున్నారు. వస్త్రాలు ధరిస్తేనే ఆలయంలోకి అనుమతిస్తామని స్పష్టంచేశారు. దీంతో ఆమె పెట్రోల్ పోసుకుని ఆత్మార్పణ చేసుకుంటానని చెప్పగా.. పోలీసులు అనునయించి తమిళనాడు పరిధిలోని ఆరంబాకంలో వదిలిపెట్టారు. మళ్లీ ఆమె శ్రీకాళహస్తికి బయలుదేరారు. సాయంత్రం బుచ్చినాయుడు కండ్రిగ వద్దకు ఆమె కారు చేరుకోగా.. పోలీస్ స్టేషన్ వద్ద సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. ఆమె కారును తనిఖీ చేశారు. అఘోరి ఒంటిపై బట్టలు లేకపోవడంతో శాలువా ఇచ్చి కట్టుకోమని ఒప్పించారు. అనంతరం అఘోరిని దించి కారు తనిఖీ చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి తాను వస్త్రాలు ధరించి వెళతానని ఆమె చెప్పడంతో బందోబస్తుతో పోలీసులు ఆమెను తీసుకెళ్లి, స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు.

వీఆర్‌కు ఈస్ట్ సీఐ

● విధుల పట్ల నిర్లక్ష్యం..

కేసుల నమోదులో అలసత్వమే కారణం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులును వీఆర్‌కు పంపుతూ ఎస్పీ సుబ్బరాయుడు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈస్ట్ సీఐగా ఆయన బాధ్యతలు స్వీకరించి నెల రోజులే కావడం గమనార్హం. విధుల పట్ల నిర్లక్ష్యం.. కేసుల నమోదులో అలసత్వంతో వ్యవహరించడమే కారణమని తెలిసింది. విధుల్లో చేరినప్పటి నుంచీ ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల అసహనం వ్యక్తం చేయడం, ప్రతి రోజూ నమోదవుతున్న ఎఫ్ఐఆర్‌లను ఉన్నతాధికారులకు తెలియచేయడంలో అలక్ష్యం చూపడం, కొన్ని కేసుల వివరాలు స్టేషన్ జనరల్ డైరీలో ఎంట్రీ చేయకనే నేరుగా బాధితులతో మాట్లాడి రాజీ కుదుర్చుతున్నారనే ఫిర్యాదులు ఎస్పీ దృష్టికి వెళ్లాయి. దీంతో వీటిపై విచారణకు ఆయన ఆదేశించారు. తిరుపతి స్పెషల్ బ్రాంచి అధికారులు విచారించి నివేదిక ఇచ్చారు. దీంతో ఆయన్ను వీఆర్‌కు పంపారు. తక్షణం రిలీవ్ అయి ఎస్పీ వద్ద రిపోర్టు చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఈస్ట్ ఇన్‌చార్జి సీఐగా రామకృష్ణ

తిరుపతి ఈస్ట్ ఇన్‌చార్జి సీఐగా వెస్ట్ సీఐ రామకృష్ణను నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గురువారం ఈస్ట్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎస్ఐలు, సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందచేశారు. అనంతరం డీఎస్పీ వెంకటనారాయణను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేశారు.

గత సీఐ కూడా వీఆర్‌కే..

గతంలో ఈస్ట్ సీఐగా పనిచేసిన మహేశ్వరరెడ్డిపై అవినీతి ఆరోపణలు రావడం, టీటీడీ మార్కెటింగ్ జీఎం మురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదును నమోదు చేయడానికి భయపడి అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఆయన్ను వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో శ్రీనివాసులును నియమించారు. అయితే కొద్ది రోజులకే ఈయనపైనా పలు అవినీతి ఆరోపణలు రావడంతో వీఆర్‌కు బదిలీ చేశారు.

పెచ్చులూడిన విశ్రాంతి గది

● ముగ్గురు ప్రయాణికులకు గాయాలు

● తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఘటన



తిరుపతి(సెంట్రల్)నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్ విశ్రాంతి హాలులో గురువారం శ్లాబ్ పెచ్చులూడి పడి ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. మొదటి ప్లాట్‌ఫారంలో ఉన్న మహిళల విశ్రాంతి హాలులో గురువారం మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటున్న మహిళలపై సిమెంటు పెచ్చులూడి పడ్డాయి. ముగ్గురు గాయపడడంతో వారిని రుయాస్పత్రికి తరలించారు. ఇందులో ఒకరికి తీవ్రంగానూ, మరో ఇద్దరికి స్వల్పంగానూ గాయాలయ్యాయి. పాత భవనాలకు మరమ్మతులు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో వర్షం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గతనెలలో కురిసిన తుఫాను తర్వాత మళ్లీ ఈ స్థాయిలో వర్షం పడటం ఇప్పుడే. మండలాల వారీగా వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. దొరవారిసత్రం 88.2 మి.మీ, బుచ్చినాయుడుకండ్రిగ 61.4, సూళ్ళూరుపేట 52.4, చిట్టమూరు 43.2 వాకాడు 36.2, నాయుడుపేట 28.8, సత్యవేడు 28.6, పెళ్లకూరు 27.6, తొట్టంబేడు 26.4, వడమాలపేటలో 24.4మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.



తిరుపతి నగరంలో..

'ఓపీ' జాప్యం కాకుండా చర్యలు

● సోమవారం నుంచి మరో రెండు అదనపు కౌంటర్లు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(వైద్యం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇకపై రుయాసుపత్రిలో ఓపీ మంజూరులో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టినట్టు సూపరింటెండెంట్ రవిప్రభు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రుయాలో 'ఓపీ'కకు పరీక్ష' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఓపీ మంజూరుకు ఆధార్ లింక్ చేయాల్సి ఉందని, అలాగే బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి కావడంతో కాస్త ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. ఇకపై ఆలస్యం జరుగకుండా సోమవారం నుంచి మరో రెండు అదనపు ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దీంతో మొత్తం 9 ఓపీ కౌంటర్లు రోగులకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇకపై ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జనరల్ ఓపీ ఉండనుంది. అత్యవసరం, చిన్నపిల్లల విభాగ ఓపీ 24 గంటలూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేయగలరా..

● చెవిరెడ్డికి టీడీపీ నాయకుల సవాల్



శ్రీనివాసమంగాపురంలో ప్రమాణం చేస్తున్న టీడీపీ నేతలు

చంద్రగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మీరు అవినీతి పరుడు కాదని ప్రమాణం చేశాకే ఎమ్మెల్యే నానిపై అవినీతి ఆరోపణలు చేయాలంటూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి మండల టీడీపీ నేతలు స్పష్టంచేశారు. గురువారం శ్రీనివాసమంగాపురంలో వినాయకస్వామి ఆలయం వద్ద చెవిరెడ్డి అవినీతి పరుడంటూ వీరు ప్రమాణం చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు మొక్కల కుమారరాజారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ నేతలపైన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి తప్పుడు అవినీతి ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన పార్టీ పత్రికలో, సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు రాయిస్తున్నారన్నారు. చెవిరెడ్డి, అతని కుటుంబ సభ్యులు ఇసుక మాఫియా, గ్రావెల్, భూకబ్జాలకు పాల్పడి వందల కోట్లు సంపాదించిన విషయం ప్రజలకు తెలుసన్నారు. అవినీతికి పాల్పడలేదని శ్రీనివాసమంగాపురం లేదా తుమ్మలగుంట ఆలయంలో ప్రమాణం చేయాలని చెవిరెడ్డికి సవాలు విసిరారు. టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, వలపల ధశరథనాయుడు, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, రాజులగారి వినోద్, బండి వాసుదేవరెడ్డి, మునిరత్నంరాయల్, సునీల్, గురుమూర్తిరెడ్డి, హరి, యల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్స్ అందజేస్తున్న డీఆర్డీఏ పీడీ శోభన్ బాబు.

తిరుచానూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని మహిళా ప్రాంగణంలో బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్స్ అందజేరు. గురువారం మహిళా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా రాణించాలని ఆకాంక్షించారు. సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ ఫర్హానా, లోకనాథం, పలువురు మహిళలు పాల్గొన్నారు.

సమర్థంగా నైపుణ్యగణన నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

భాకరాపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా నైపుణ్య గణనను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంఈవో సత్యనారాయణ సూచించారు. చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నైపుణ్య గణనపై గురువారం ఆయన కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 నుంచి 59 సంవత్సరాల వయస్సు వారికి సంబంధించిన విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, స్వయం ఉపాధి, వ్యాపారం వంటి వివరాలను ప్రశ్నావళిలో నింపాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లినప్పుడు ఆయా గృహస్థుల ఆసక్తులను కూడా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, ఏవో సతీశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యం



మాట్లాడుతున్న సోమశేఖర రెడ్డి

భాకరాపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యమని చిన్నగొట్టిగల్లు ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో వెలుగు సంఘమిత్రలకు ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు సంఘాల్లో చాలా మంది మహిళలు కేవలం సంతకం మాత్రమే చేయగలరన్నారు. పదాలు చదవడం, రాయడం రావడం లేదన్నారు. సంఘాల్లోనూ, గ్రామాల్లోనూ నిరక్షరాస్యులను గుర్తించి చదువు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో స్వర్ణలత, సీసీలు పాల్గొన్నారు.

రైతుల పొలాల దారి సమస్యకు పరిష్కారం



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దారు జనార్దన్ రాజు

భాకరాపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిట్టేచర్ల పంచాయతీ తుమ్మచేనుపల్లెలో రైతుల పొలాల రారి సమస్యను తహసీల్దారు జనార్దన్‌రాజు గురువారం పరిష్కరించారు. చిట్టేచర్ల గ్రామ లెక్క దాఖలా సర్వేనెం.661 లోపల చెరువు భూమిని అదే గ్రామానికి చెందిన ఒక రైతు కొన్నేళ్లుగా ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నాడు. తమకు దారి ఇవ్వకుండా ఇతడు ఇబ్బంది పెడుతున్నారంటూ బాధిత రైతులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ చొరవ తీసుకుని రెవెన్యూ అధికారులను గ్రామానికి తీసుకెళ్లి రైతులతో చర్చించారు. రెవెన్యూ అధికారులు రైతుల ఫిర్యాదు మేరకు వివాదాస్పద భూమిని పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో దారి ఇచ్చేలా సమస్యను పరిష్కరించారు.

తిరుమలలో డంపింగ్ యార్డుపై టీటీడీ చైర్మన్ ఆరా



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న బీఆర్‌నాయుడు

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని కాకులమాను దిబ్బ వద్ద డంపింగ్ యార్డును గురువారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పరిశీలించారు. చెత్త సేకరణ, తడిచెత్త, పొడిచెత్త విభజన, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చైర్మన్‌తో పాటు విజిలెన్స్ వీజీవో సురేంద్ర ఉన్నారు.

ప్రియురాలిపై దాడి కేసులో ఐదేళ్ల జైలుశిక్ష

చంద్రగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రియురాలిపై దాడి చేసిన యువకునికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సునీతరాణి గురువారం తీర్పు వెలువడించారు. వివరాలిలా.. చంద్రగిరికి చెందిన పిడతల మహేష్ వర్మ, ఓయువతి ప్రేమించుకున్నారు. తర్వాత ఆయువతిపై అనుమానం పెంచుకున్నాడు. ఈనేపథ్యంలో ఈఏడాది మార్చిలో వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో అతడు కత్తితో దాడి చేశాడు. ఎస్ఐ అనిత దర్యాప్తు చేపట్టారు. గురువారం ఆ కేసులో నిందితుడు మహేష్‌కు జడ్జి సునితరాణి ఐదేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఎస్ఐ అనిత, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీదేవి, కోర్టు కానిస్టేబుల్ రామకృష్ణ, దేవేంద్రలను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. ఆడపిల్లల జోలికి వస్తే చట్ట ప్రకారం నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా పోలీస్ శాఖ పనిచేస్తుందని చెప్పడానికి ఈ కేసు నిదర్శనమన్నారు.

శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి శ్రీకారం

తిరుపతి(క్రీడలు), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయం అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం ఏపీఈడబ్ల్యూడీఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బాలసుబ్రహ్మణ్యంరెడ్డి డీఈ, సిబ్బందితో కలసి స్విమ్మింగ్ పూల్, మల్టీపర్పస్‌హాల్, వాకింగ్‌ట్రాక్, ఇండోర్ స్టేడియం, జిన్మాజియం వేదికల కొలతలను నమోదు చేశారు. రెండు రోజుల్లో అంచనాలు సిద్ధం చేయనున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తామని డీఎస్‌డీఓ సయ్యద్‌సాహెబ్ తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో జరగనున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి ఆవిష్కరించారు. ఎస్వీయూలో గురువారం చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించి, భవిష్యత్తు ఉద్యమ ప్రణాళిక రూపొందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఎస్వీయూ అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, చంద్రనాయక్, నాయకులు హరికృష్ణ, శివరామకుమారి, శ్రావణి, వనిత, మల్లిక, వాణిశ్రీ, మౌనిక, పద్మప్రియ, స్నేహ, నరసింహులు, రాజు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో మంత్రాలయ మఠాధిపతి



సుబుదేంద్ర తీర్థస్వామిజీ

తిరుమల, నవంబరు7(ఆంధ్ర జ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠాధిపతి సుబుదేంద్ర తీర్థస్వామిజీ దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయంలోకి వెళ్లి ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. విశాఖ సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

మృతుడు అనంతపురం జిల్లా వాసి

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుచానూరు మధ్య రైలు పట్టాలపై బుధవారం ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి అనంతపురం జిల్లా కల్యాణదుర్గం బుట్టవానిపల్లెకు చెందిన కుమ్మరి ఆంజనేయులుగా పోలీసులు గుర్తించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ విఠల్‌నాయక్ కథనం మేరకు.. ఆంజనేయులు ఈనెల మూడో తేదీన శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి వచ్చాడు. 4న తిరుమలకు వెళ్లి తలనీలాలు సమర్పించి, స్వామి వారిని దర్శించుకున్నారు. 5న తిరుపతికి చేరుకుని శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తున్న తరుణంలో ఈస్ట్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి బస్టాండులో వదిలిపెట్టారు. 6న తెల్లవారుజామున ఆయన రైలు పట్టాలపై శవమై కనిపించాడు. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు మృతుడి వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించనున్నారు.

టీటీడీ చైర్మన్‌కు ఆత్మీయ సత్కారం



బీఆర్ నాయుడిని సన్మానిస్తున్న నాని దంపతులు

తిరుచానరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు గురువారం తిరుచానూరు సమీపంలోని రఘునాథ రిసార్ట్‌లో ఎమ్మెల్యే పులివర్తి నాని నివాసానికి వచ్చారు. ఆయనను ఎమ్మెల్యే, ఆయన సతీమణి సుధారెడ్డి ఘనంగా సన్మానించారు. టీటీడీ నాయకులు పాల్గొన్నారు.

మీడియా రంగంలో సాంకేతిక ప్రభావం తీవ్రం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మీడియా రంగంలో సాంకేతిక పరిజ్ఞాన ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని ప్రొఫెసర్ ప్రదీప్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో నిర్వహించిన సీవీఎస్ శర్మ ధర్మనిధి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మీడియా రంగంలో వస్తున్న సమాచారాన్ని నిర్ణయిస్తోంది యాజమాన్యాలు కాదనీ, పాఠకులని అన్నారు. సమాచారాన్ని చేరవేసే ముందు నిజాన్ని నిర్ధారించుకోవాల్సిన అవసరం మరింత పెరిగిందని అభిప్రాయపడ్డారు. మీడియా రంగం పట్ల ప్రాథమిక స్థాయి నుంచే ఈ తరానికి బోధించాల్సిన అవసరం ఉందన్నారు. పద్మావతి వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ దుర్గాభవాని మాట్లాడుతూ జర్నలిజం విభాగ వ్యవస్థాపక ప్రొఫెసర్‌గా సీవీఎస్ శర్మ ఉన్నత మార్గాన్ని నిర్దేశించారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్లు వాణి, విజయలక్ష్మి, జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ బీఎన్ నీలిమ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ పోటీలు ప్రారంభం

తిరుపతి అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో గురువారం రాష్ట్రస్థాయి క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ 10వ వార్షిక క్వాలిటీ పోటీలు ప్రారంభమయ్యాయి. చైర్మన్ జగన్మోహన్ మాట్లాడుతూ గతంలో తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు.

కాలం చెల్లిన నిర్మాణాలపై కలవరం

● శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు, కొన్ని భవనాలు

● కూలేందుకు సిద్ధంగా ఉన్నా పట్టించుకోని అధికారులు



ప్రమాదకరస్థితిలో వాటర్ ట్యాంక్



కాలం చెల్లిన భవనాలు

పాకాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నివాస గృహాల మధ్య కొన్ని శిథిల భవనాలతో ప్రమాదం పొంచి ఉంది. యేళ్లనాటి భవనాలు నివాస యోగ్యం లేక కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. ఇటీవల వర్షాలకు పాక్షికంగా కూలి శిథిలాలు రోడ్డుపై పడి ఆందోళన కలిగిస్తున్నాయి. పాకాల ధర్మరాజుల గుడి వీధిలో వందేళ్ల క్రితం రాతితో వాటర్ ట్యాంకు నిర్మించారు. దీని వెనుకవైపు బావి వుంది. అప్పట్లో పట్టణం మొత్తానికి ఈ బావిలోని నీరు ట్యాంకు ద్వారా సరఫరా అయ్యేవి. కాలక్రమంలో పట్టణం విస్తరించింది. నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకుల బోర్లద్వారా నీటి సరఫరా జరుగుతోంది. బావిలో నీరు లేకపోవడం, రాతి కట్టడం శిథిలావస్థకు చేరుకోవడంతో 20 యేళ్లకు పైగా ట్యాంకు నిరుపయోగంగా మారింది. ఇది కూలితే సమీప గృహాలకు తీవ్ర నష్టం చేకూరుతుందనే ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. అదే వీధిలోని మూడు నివాస గృహాలు కూడా పాతబడి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. సత్యమ్మ గుడి సమీపంలోని పోస్టాఫీసు ఎదురుగా రెండు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇవి పాక్షికంగా కూలాయి. ఇందులో నివాసాలు లేకున్నా ఎదురుగా రోడ్డుపై జనసంచారం అధికంగా వుంటుంది. విద్యార్థులు, స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాలకు భవనాలు కూలితే ప్రమాదం ఎదురవుతుందని ప్రజానీకం కలవరపడుతోంది. కాలం చెల్లి శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి యజమానులకు నోటీసులు ఇచ్చి తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.



శిథిలావస్థకు చేరిన భవనం

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పులివర్తినాని చెప్పారు. తిరుపతి రూరల్‌మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశంలో గురువారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ వేముల యశోద అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సర్పంచ్‌లు వివిధ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చినప్పుడు నాని స్పందించారు. ప్రతిపక్షనేతగా తాను గ్రామాలను సందర్శించినప్పుడు కూడా ప్రజలు పలు సమస్యలను వివరించారన్నారు. వాటి పరిష్కారానికి వెంటనే తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గతంలో గ్రామపంచాయతీల్లో నిధుల కొరతతో పలు అభివృద్ధిపనులు ఆగిపోయాయని పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పారు. వేంకటపతినగర్, అవిలాల, లింగేశ్వరనగర్, కుంట్రపాకం, గాంధీపురం, తుమ్మలగుంట పంచాయతీల్లో అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాల వసతి కల్పించాలని కోరారు. వేదాంతపురంలో ఎంపీపీస్కూల్,వాటర్‌హెడ్ ట్యాంక్‌లు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయన్నారు. సాయినగర్ సచివాలయభవనాన్ని త్వరితగతిన పూర్తిచేసి పంచాయతీకి అప్పగించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ, ఎంపీడీవో రామచంద్ర, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, డీటీలు జయంత్‌కుమార్, మోహన్, పంచాయతీ రాజ్ డీఈ మురళి, హౌసింగ్ ఏఈ శ్రీరాములు రెడ్డి, ఈవోపీఆర్డీ మాధురి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. చెత్తడంపింగ్‌కోసం రెండెకరాలను కేటాయించాలని సీఎంను కోరనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత వైసీపీపాలనలో కొట్టుకుపోయిన బ్రిడ్జిల పునర్నిర్మాణానికి టీటీడీ నిధుల కేటాయింపు విషయంలో మండలానికి చెందిన ప్రజాప్రతినిధులందరూ కలసి వస్తే అధికారులతో మాట్లాడతానన్నారు. తానుగానీ కుటుంబసభ్యులుగానీ ఎక్కడైనా అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే నిలదీయవచ్చన్నారు.

ఇసుక తరలింపునకు అడ్డగింత

● బీజేపీ నాయకురాలు లక్ష్మి ఆవేదన



ఇసుక ట్రాక్టర్, జేసీబీను సీజ్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చంద్రగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నాగయ్యగారిపల్లెలో తన పొలం సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుక తరలించకుండా టీడీపీ నాయకుడు నాగరాజనాయుడు, ఆయన కుమారుడు రుతేష్, తులసిలు అడుకుంటున్నారని బీజేపీ నాయకురాలు లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఇసుక తరలించడానికి ట్రాక్టర్‌ను తీసుకుని వెళితే నాగరాజనాయుడు, అతని అనుచరులు అడ్డుకున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన, అనుచరులు దర్జాగా ఇసుక తరలిస్తున్నా తాము అడ్డుకోలేదన్నారు. దీనిపై ప్రశ్నించినందుకు తనపై దాడి చేయడానికి ప్రయత్నించి దుర్భాషలాడారన్నారు. టీడీపీని అడ్డంపెట్టుకుని ఇసుక తరలిస్తున్నారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా నాగయ్యగారిపల్లె వద్ద గురువారం ఇసుక అక్రమంగా తరలిస్తుండగా రెవెన్యూ సిబ్బంది దాడులు నిర్వహించారు. జేసీబీ, ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేశారు. ట్రాక్టర్, జేసీబీ యజమానులపై చర్యలు తీసుకొంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి పవన్ సానుకూలం



తిరుపతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సానుకూలంగా ఉన్నారని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ గురువారం మంగళగిరిలో సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. తిరుపతికి చెందిన టీడీపీ నేత, చాంబర్ నాయకుడు సింగంశెట్టి హాజరై సర్పంచ్‌ల సమస్యలపై నివేదించారు.

అవగాహనతో క్యాన్సర్‌ను నివారించవచ్చు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, డీఎంహెచ్ఓ శ్రీహరి

తిరుపతి(వైద్య), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అవగాహనతో క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్విమ్స్‌లో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ముందు జాగ్రత్తలు పాటించడం వల్ల నివారించవచ్చునని తెలిపారు. స్విమ్స్, రుయా ఆస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు చేయించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, రుయా సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ, స్విమ్స్ సూపరింటెండెంట్ రామ్, ఎంఓ కోటిరెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, స్విమ్స్ క్యాన్సర్ విభాగ నోడల్ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

చంద్రగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కల్యాణి డ్యామ్ మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. చిన్నగొట్టిగల్లు మండలం చెట్టేవారిపల్లెకు చెందిన గోపి గురువారం భాకరాపేట నుంచి తిరుపతికి బైక్‌పై వస్తుండగా కల్యాణీ డ్యామ్ మలుపు వద్ద ఆర్టీసీ బస్ ఢీ కొంది. దీంతో ఇతడు తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితికి చేరుకున్న గోపిని ఆమార్గంలో వస్తున్న కానిస్టేబుల్ చిరంజీవి స్పందించి ఆటోలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

కొండకు కొత్త బస్సులు ఇవ్వండి

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండకు ఇంధనంతో నడిచే నూతన బస్సులు ప్రవేశపెట్టాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి తాండాయం సత్యనారాయణ బృందం గురువారం ఆర్టీసీ ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ఈడీ(ఏ)రవివర్మ, ఈడీ(ఓ)అప్పలరాజు, ఈడీ(ఈ)చెంగల్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. జిల్లాలో నెలకొన్న ఆర్టీసీ సమ్యలను వారి దృష్టికి తెచ్చారు. ప్రయాణికుల భద్రత, సురక్షిత ప్రయాణం దృష్ట్యా తిరుమలకు కొత్తగా సప్తగిరి బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. సీటీఎస్ పూర్తిగా మరమ్మతులకు గురైందని, త్వరితగతిన ఇంటిగ్రేటెడ్ బస్సు టర్మినల్ నిర్మాణం చేపట్టాలని కోరారు.

ఉపాధి కూలీకి పాము కాటు

చంద్రగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్త శానంబట్ల గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కూలీ కృష్ణారెడ్డి పాము కాటుకు గురయ్యాడు. గురువారం ఉపాధి హామీ పనులు చేస్తుండగా ఇతడిని పాము కాటేసింది. వెంటనే తోటి కూలీలు చంద్రగిరి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేయించాక మెరుగైన చికిత్సకు రుయా ఆసుపత్రికి తరలించారు.

తిరుపతిలో జోరువాన









తిరుమలలో బ్యాటరీకారులో ఇలా...

తిరుపతి అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో తిరుపతిలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. పలుమార్లు ఆగి ఆగి కురవడంతో నగరంలోని పలు వీధులు జలమయమయ్యాయి. శ్రీనివాససేతు నుంచి జలధారలు ఉధృతంగా ప్రవహించాయి. కపిలతీర్థం, మాల్వాడి గుండం జలపాతాల జోరు చూపరులకు కనువిందు చేశాయి. డ్రైనేజీలు పొంగి చెత్త రోడ్లపై పేరుకుంది. కాలువలు, తూములు స్తంభించడంతో పారిశుధ్య కార్మికులు వర్షంలో తడుస్తూనే తొలగించడం కనిపించింది. తిరుమల బైపాస్, కరకంబాడి, రేణిగుంట, ఎయిర్‌బైపాస్, బాలాజీకాలనీ రోడ్లపై వర్షపు నీరు జోరుగా ప్రవహించాయి. విద్యార్థులు, ఉద్యోగులు తడుస్తూనే పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లడం కనిపించింది. వ్యాపారులు ఇబ్బందిపడ్డారు. మార్కెట్, బస్టాండు పూర్తిగా జలమయమయ్యాయి..

తిరుమల: తిరుమలలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం 11 గంటల వరకు చిరుజల్లులు పడ్డాయి. తర్వాత గంట పాటు జోరుగా వర్షం కురిసింది. సాయంత్రం 4 మళ్లీ జోరందుకుంది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, పరిసర ప్రాంతాలు, కాటేజీలు, పార్కులు, రోడ్లు జలమయమయ్యాయి. భక్తులు వర్షంలో తడిసిముద్దయ్యారు. కొంతమంది షెడ్లు, మండపాలు, కార్యాలయాలు, దుకాణ సముదాయాల్లో తలదాచుకున్నారు. వాహనదారులు, కాలినడక భక్తులు కూడా ఆగచాట్లు పడ్డారు. వర్షం నేపథ్యంలో చలితీవ్రత కూడా పెరిగింది.

తిరుపతి

వైసీపీ కార్పొరేటర్ల బలమింతేనా?

కౌన్సిల్ సమావేశంలో రచ్చరచ్చ

● అజెండా అంశంపై చేతులెత్తమంటే తేలిపోయిన వైసీపీ సభ్యుల సంఖ్య
● పదిమంది కూడా స్పందించని వైనం ● స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై వైసీపీ రగడ




కౌన్సిల్ సమావేశం - వైసీపీ కార్పొరేటర్‌తో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ వాగ్వాదం

తిరుపతి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్లో వైసీపీ కార్పొరేటర్ల బలం తేలిపోయింది. పదిమంది కూడా వైసీపీ వైపులేరని స్పష్టమైంది. వీరిలోనూ సభలో ఓటు హక్కులేని కోఆప్షన్ మెంబర్లు ఐదుగురిలో కొందరు కూర్చుని, మరికొందరు నిల్చుని చేతులెత్తడం చర్చనీయాంశమైంది. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన గురువారం ఎస్వీయూ సెనెట్ హాలులో జరిగింది. అజెండాలోని 14వ అంశంలో స్టాండింగ్ కౌన్సిల్ (మున్సిపల్ అడ్వకేట్)గా దినకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మేయర్ కూడా ఆమోదించారు. ర్యాటిఫై కోసం కౌన్సిల్ అజెండాలో పెడితే కొందరు వైసీపీ కార్పొరేటర్లు నియామకాన్ని వ్యతిరేకించారు. వైసీపీలోని చంద్రశేఖర్ రెడ్డినే కొనసాగించాలని పట్టుబట్టారు. ఎన్నికల్లో వైసీపీ పక్షాన కండువా వేసుకుని ప్రచారం చేసిన చంద్రశేఖర్ రెడ్డి తీరుపై ఆంధ్రజ్యోతిలో వార్త రావడంతో ఎన్నికల సంఘం స్టాండింగ్ కౌన్సిల్ నుంచి తప్పించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిబంధనల మేరకు కొత్త వ్యక్తిని ఎన్నుకున్నారు. అయినా చంద్రశేఖర్ రెడ్డినే నియమించాలని వైసీపీ కౌన్సిలర్లు నినదించారు. మేయర్, కమిషనర్లు నచ్చజెప్పినా వినలేదు. ఈ దశలో మేయర్ జోక్యం చేసుకున్నారు. దినకర్ వద్దనే వారు చేతులెత్తాలని కోరారు. పదిమంది కూడా చేతులెత్తలేదు. టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ స్పందిస్తూ 'మీ బలమేంటో బహిరంగంగానే తేలిపోయిందని ఎద్దేవా చేశారు. ఓటు హక్కులేని సభ్యులు చేతులెత్తినా మెజారిటీ లేదని చెప్పడంతో తెల్లముఖాలు వేశారు.



కార్పొరేటర్ల వాగ్వాదం

అన్నింటికీ రభసేనా..

స్టాండింగ్ కమిటీ ఎన్నికల వాయిదా అంశాన్ని కూడా వైసీపీ కార్పొరేటర్లు రభస చేశారు. తమకు మెజారిటీ ఉందని భయపడే ఎన్నికలు నిర్వహించలేదంటూ చెప్పుకొచ్చారు. కమిషనర్ మౌర్య స్పందిస్తూ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వీఐపీల పర్యటనల నేపథ్యంలోనే వాయిదా వేశామన్నారు. త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామని చెప్పినా కొందరు వినలేదు. కూటమి పక్షాన 30 మంది ఉన్నారని, రహస్య బ్యాలెట్ పెడితే అదికూడా తేలిపోతుందని ఆర్సీ మునికృష్ణ చెప్పడంతో తేల్చుకుందామంటూ వైసీపీ కార్పొరేటర్లు సవాల్ విసిరారు. జనసేన కార్పొరేటర్లు సీకే రేవతి, కల్పన యాదవ్, అన్నా అనితలు మాట్లాడుతూ గత ప్రభుత్వం దోచుకోవడంలో పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై చూపలేదన్నారు. అనిత మాటలకు వైసీపీ కార్పొరేటర్లు ఆవేశంతో ఊగిపోయారు. కాగా టీడీపీ కార్పొరేటర్ అన్నా సంధ్య తొలిసారి టీడీపీ కండువాతో కౌన్సిల్‌కు వచ్చారు.

సమస్యలను పరిష్కరించండి

డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ మాట్లాడుతూ 30 ఏళ్లక్రితం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఆ తర్వాత మళ్లీ పట్టించుకోలేదన్నారు. ఎస్కే బాబు మాట్లాడుతూ ఈస్టు పోలీస్ స్టేషన్ పక్క స్థలంపై కార్పొరేషన్‌కు అనుకూలంగా తీర్పు వచ్చినందున స్వాధీనం చేసుకోవాలన్నారు. నరసింహాచారి మాట్లాడుతూ మంచినీళ్ల గుంట ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సచివాలయ వీఆర్వో పోస్టు భర్తీ చేయాలన్నారు. కోఆప్షన్ సభ్యుడు ఇమామ్ మాట్లాడుతూ సింగాలగుంట పేరును ఎస్ఎన్‌జీ లేఅవుట్‌గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. చేపల మార్కెట్‌ను మార్చాలని 44వ డివిజన్ కార్పొరేటర్ నారాయణ కోరారు. దశరథరామి రెడ్డి మాట్లాడుతూ ఇంకా ఇవ్వని వారికి టీడీఆర్ బాండ్లు ఇప్పించాలన్నారు. 700 బాండ్లు వరకు పెండింగ్‌లో ఉన్నాయని, ఇటీవలే ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రభుత్వం ఓపెన్ చేసిందని కమిషనర్ స్పందించారు. త్వరలోనే అర్హులకు బాండ్లు అందజేస్తామన్నారు.

ప్రాధాన్యత ప్రకారం నిధుల వినియోగం : ఎమ్మెల్యే

ఎక్స్ అఫిషియో సభ్యుడిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత నిధులను అవసరాలను బట్టి కార్పొరేటర్లతో అధికారులు చర్చించి ప్రాధాన్యత క్రమంలో వినియోగించాలన్నారు. పార్కుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కల్పించి, వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేయాలన్నారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ మంచి నిర్ణయాలకు మన కౌన్సిల్ వేదిక కావాలన్నారు. అభివృద్ధి ముందు తరాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ హోటల్స్‌లో కల్తీ ఆహారాన్ని నిరోధించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి స్టిక్కర్, మెమెంటో అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా కమిషనర్లు ఎం.ఎం.రెడ్డి, రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి జయరాం, వెంకటేశ్వర్లు, బాలిప్రసాద్ పాల్గొన్నారు.

భానుప్రకాష్‌రెడ్డికి అభినందనలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 7: టీటీడీ పాలకమండలి సభ్యులు జి.భానుప్రకాష్‌రెడ్డికి వేదిక్ వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి అభినందనలు తెలియజేశారు. గురువారం ఉదయం ఆయన భానుప్రకాష్‌రెడ్డిని తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు చెప్పారు. తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు, కార్యదర్శి వాసు తదితరులు భానుప్రకాష్‌ను సన్మానించి, అభినందించారు.



భానుప్రకాష్‌రెడ్డిని అభినందిస్తున్న వేదిక్ వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న రవిమనోహరాచారి

తిరుపతి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండి, ప్రజలను చైతన్యపరచాలని అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. ఎస్వీ వెటర్నరీ కళాశాలలో అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జగపతిరామయ్య అధ్యక్షతన గురువారం సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి.. భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. ఓఎస్‌ఏ డాక్టర్ ఆర్.వేణు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ అమరావతి, డాక్టర్ రాజా, డాక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్జీరంగా జయంతి



ఎన్జీరంగా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఏడీఆర్ సుమతి

తిరుపతిరూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో గురువారం ఆచార్య ఎన్జీరంగా 124వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పలువురు పుష్పాంజలితో నివాళి అర్పించారు. ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అవిలాల చెరువు అభివృద్ధికి అధ్యయన కమిటీ



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుచానూరు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు లోబడి అవిలాల చెరువు అభివృద్ధి కోసం అధ్యయన కమిటీని ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, మున్సిపల్ కమిషనర్ మౌర్య, జేసీ శుభం బన్సల్, టీటీడీ సీఈ సత్యనారాయణ ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ టీటీడీ సీఈ, ఇరిగేషన్ ఈఈ, ఎన్‌హెచ్ఎస్ పీడీ, తిరుపతి ఆర్డీవో, తుడా సెక్రటరీలతో కమిటీని ఏర్పాటు చేసి, రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని తెలిపారు. తుడా సెక్రటరీ డాక్టర్ వెంకటనారాయణ, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణ్‌రెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గజరాజు చాటున..

గజరాజుకు అటు, ఇటు మావటిలు. ఒకటో జోరు వాన. వానకు తడవకుండా గజరాజుపై కప్పిన వస్త్రాన్ని చాటు చేసుకున్నారు. ఇలా వీరు మంగళవారం శ్రీవారి ఆలయం ముందు గజరాజు పక్కన వస్తుండగా పలువురు భక్తులు ఆసక్తిగా తిలకించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

షార్‌కు చేరిన పీఎస్ఎల్వీ-సీ 59 సామగ్రి

భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీహరికోటలోని సతీష్ థావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి డిసెంబరులో ప్రయోగించే పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్‌కు సంబంధించిన సామగ్రి గురువారం షార్‌కు చేరింది. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో సామగ్రిని షార్‌కు తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ రాకెట్ ద్వారా రోదసీలోకి పంపే బెల్జియం దేశానికి చెందిన ప్రోబా-3 ఉపగ్రహం రెండు రోజుల క్రిత్రం షార్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రయోగానికి సంబంధించిన ఏర్పాట్లు షార్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. డిసెంబరు 5న షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్ ప్రయోగం చేపట్టేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి





ఆనందసాయి, టీటీడీ బోర్డు సభ్యుడు

యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన విశ్వకర్మ ఆనంద్‌సాయి టీటీడీ పాలకమండలి సభ్యుడయ్యారు. శంషాబాద్ సమీపంలోని రామానుజాచార్యుల ఆశ్రమ రూపకల్పనలోనూ ఆయనది ప్రధాన పాత్ర. నిజానికి ఆయన సినిమా ఆర్ట్ డైరెక్టర్. తొలిప్రేమ సినిమా కోసం ఏకంగా తాజ్‌మహల్‌నే సముద్రపు ఒడ్డున ప్రతిష్ఠించిన నిపుణుడు. యమదొంగ, సైనికుడు, గుడుంబా శంకర్, బాలు, బృందావనం, నాని, బద్రీనాథ్ వంటి వందకు పైగా సినిమాలకు కళాదర్శకుడిగా వ్యవహరించారు. ఆగమ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన వాస్తుశిల్పి, పవన్ కల్యాణ్‌కి సన్నిహిత మిత్రుడు. తిరుమల రూపురేఖలను తన కళానేత్రంతో దర్శిస్తున్న ఆనంద్‌సాయితో ఆంధ్రజ్యోతి సంభాషణ...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పురా సౌందర్యవనంలా తిరుమల

40 ఏళ్ల తర్వాత వచ్చిన విశ్వకర్మను

ఇది పెద్ద బాధ్యత. దేవుడి అనుగ్రహం. స్వామివారే డిప్యూటీసీఎం ద్వారా ఈ అవకాశాన్ని నాకు కల్పించారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత టీటీడీ బోర్డులోకి విశ్వకర్మగా వచ్చింది నేనే. మనం చేసేది మనం చేయాలి. మిగతాది దేవుడే చేస్తాడు. నాతో చేయించుకుంటాడు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. ఇద్దరూ చాలా క్రియేటివ్. వారి ఆధ్వర్యంలో ఒక అత్యద్భుత ఆధ్యాత్మిక వాతావరణం తిరుమలలో సాకారం అవుతుందనే నమ్మకం ఉంది. తిరుమలలో ఇప్పటికే అద్భుతమైన ఆర్కిటెక్చర్ ఉంది. దీంతో పాటు శ్రీవారి ఆలయానికి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేయాలి.

"నాది సంపాదించి, కుటుంబాన్ని బాగా చూసుకోవాల్సిన వయస్సు. అయినా స్వామి కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పనిచేస్తా. భయంతో, భక్తితో చేసే పని మంచి ఫలితాలనే ఇస్తుంది."

క్యూలైన్‌లలో కళా ప్రదర్శనలు

స్వామి దర్శనానికి 24 గంటలు, ఒక్కోసారి మూడు రోజులు కూడా నిరీక్షిస్తున్న సందర్భాలు ఉన్నాయి. క్యూలైన్లలో ఉండేవారు మానసికంగా ఒత్తిడికి గురవుతారు. దాన్ని తొలగించగలగాలి. క్యూలైన్లలో చిన్న చిన్న ఆడిటోరియంలు నిర్మించాలి. భరతనాట్యం, కూచిపూడి, హరికథలు, వాయిద్య కళాప్రదర్శనలు ఏర్పాటు చేయాలి. స్వామివారి వైభవం, తిరుమల విశిష్టత, చరిత్ర వంటి అంశాలను యానిమేటెడ్ వీడియోలుగా రూపొందించి చూపించాలి. పిల్లల కోసం ప్రత్యేకంగా కథలు రూపొందించి ప్రదర్శించాలి. నిరీక్షణ సమయాన్ని ఉల్లాసంగా మార్చగలగాలి.

"గతంలో తిరుమల ఆలయం ముందు తొలగించిన వెయికాళ్ల మండపానికి పురాతన చరిత్ర ఉంది. దాన్ని మరొక ప్రదేశంలో ఏర్పాటు చేసి ఉంటే బాగుండేది. ఆ దిశగా కూడా ఆలోచనలు చేస్తాం."

విజయనగర రాజ్యంలా తిరుమల

తిరుమల చాలా పవర్‌ఫుల్ ఎనర్జీ ఉన్న ప్రదేశం. ఇక్కడ మోడరన్ బిల్డింగులు ఎందుకు? పురాతన సంప్రదాయాలను మళ్లీ తీసుకురావాలి. ఆ సౌందర్యం తిరుమలలో కనిపించాలి. తిరుమలకు వచ్చే వారందరికీ గొప్ప ఫీల్ రావాలి. కొండెక్కగానే చెప్పులు వదిలేసేలా ఉండాలి. శ్రీకృష్ణదేవరాయల కాలాన్ని గుర్తుచేసేలా తిరుమలను అభివృద్ధి చేయచ్చు. విజయనగర రాజ్యం గుర్తుకు రావాలి. దేశవ్యాప్తంగా పేరుపొందిన ఆర్కిటెక్చర్లు చాలా మంది ఉన్నారు. వారి సాయం తీసుకోవచ్చు. అలా మారిస్తే రాబోయే తరాలకు మంచి చరిత్ర ఇచ్చినవారమవుతాము. తిరుపతికి మన పిల్లలను తీసుకెళితే మాకు మంచి కల్చర్ వస్తుందనే అభిప్రాయాన్ని భక్తుల్లో తీసుకురావడ మనదే నా కల. దర్శనాలు, వసతి, ప్రసాదాలకు క్రియేటివిటీ జతైతే భక్తులకు గొప్ప అనుభూతులు లభిస్తాయి.

"యాదాద్రి చేసే సమయంలో వచ్చినంత సపోర్ట్ తిరుమల అంజనాద్రికి రాలేదు. ఇక్కడ సిస్టమ్ చూసి భయపడి వెళ్లిపోయా. తిరుమలలో ఏం చేయలేకపోయాననే చాలా కాలం బాధపడ్డాను. టీటీడీ ఇంజినీరింగ్ విభాగాన్ని చాలా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముంది."

నడకదారి తీరు మారాలి

పవన్‌కల్యాణ్‌తో కలిసి తిరుమలకు నడచి వస్తున్నపుడు ఆయన కొన్ని సూచనలు చేశారు. నడకదారిని అభివృద్ధి చేయాలన్నారు. అలిపిరి నుంచి తిరుమల వరకు ఉన్న నడక మార్గంలో కొంత స్టోన్ వర్క్ చేయాలి. ప్రత్యేకంగా కొన్ని మండపాలు, విశ్రాంతి సముదాయాలు ఉండాలి. ముఖ్యంగా గ్రీనరీని పెంచాలి. అలిపిరి దారిలో నడుస్తూ ఉంటే ఫారెస్ట్ ఫీల్ రావడం లేదు. కొంత ఆర్టిఫిషియల్ పార్ట్‌ను క్రియేట్ చేయాలి. ఈ మార్గంలో ఉన్న అతిపురాతన కట్టడాలు, గోపురాలను సంరక్షించుకోవాలి.



తూకివాకం సబ్‌స్టేషన్‌కు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

జిల్లాకు రెండు 132 కేవీ సబ్‌స్టేషన్లు

● వర్చువల్‌గా శంకస్థాపన చేసిన సీఎం చంద్రబాబు ● తూకివాకం, మాంబట్టులో నిర్మాణం

తిరుపతి కలెక్టరేట్/సూళ్లూరుపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం తూకివాకం, తడ మండలం మాంబట్టులో రెండు 133 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరిగింది. గుంటూరు జిల్లా నుంచి సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తూకివాకానికి సంబంధించి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, సదరన్ డిస్కం సీఎండీ సంతోష్ రావు, ట్రాన్స్‌కో ఎస్ఈ కరుణాకర్, ఎస్ఈ సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు. తూకివాకం వద్ద 133 కేవీ విద్యుత్తు స్టేషన్ ఏర్పాటుతో తిరుపతి అర్బన్, రూరల్, రేణిగుంట మండలాల్లోని 50 వేల మంది వినియోగదారులు లబ్ధి పొందనున్నారని కలెక్టరు తెలిపారు. తిరుపతి ప్రాంతంలో గృహ, వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. వోల్టేజ్ హెచ్చుతగ్గుల సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తూకివాకం జడ్పీటీసీ సుబ్రహ్మణ్యం రెడ్డి, సర్పంచ్ శివ, ట్రాన్స్‌కో ఈఈలు శ్రీనివాస్, సురేంద్ర నాయుడు, డీఈలు, ఏడీఈలు తదతరులు పాల్గొన్నారు.

● సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు 220 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం తడ మండలం మాంబట్టులో నిర్మాణం చేపట్టనున్న 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు వర్చువల్ పద్ధతిలో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రూ.43.53 కోట్లతో మాంబట్టు పారిశ్రామిక వాడలో 5 ఎకరాల విస్తీర్ణంలో ఈ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశాక జేసీ శుభం బన్సాల్ చేతుల మీదుగా మన్నారుపోలూరులో శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, ఆర్డీవో కిరణ్మయి, ట్రాన్స్‌కో ఎస్ఈ శేషా రెడ్డి, ఈఈ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, మాధవనాయుడు, తడ ఎంపీపీ రఘురెడ్డి, డీఈ బలరామ్మూర్తి, ఏడీఏ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

20.8 కిలోల గంజాయి స్వాధీనం..నలుగురి అరెస్టు

తడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టుచేశారు. డీఎస్పీ చెంచుబాబు మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. గురువారం శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు వెంటనే అక్కడికి చేరుకుని వారిని విచారించారు. వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 20.8కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లుగా గుర్తించారు. శ్రీకాకుళం నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తేలింది. నిందితులు తమిళనాడు రాష్ట్రం మధురాంతకానికి చెందిన దేవరాజ్ అలియాస్ దేవ, నరేష్ అలియాస్ రాకేష్, తిరువల్లూరు జిల్లా కామరాజపురానికి చెందిన హరిహరన్ మార్షన్ అలియాస్ హరి, బెంగళూరు కేఆర్‌పురానికి చెందిన నారాయణగా గుర్తించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు, ఇతర సిబ్బందిని అభినందించారు. అలాగే వారం రోజుల క్రితం 48 కేజీల గంజాయి, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని ఈ రెండు కేసుల్లో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డు కోసం ప్రభుత్వానికి సిఫారస్సు చేస్తున్నట్లు డీఎస్పీ చెంచుబాబు వెల్లడించారు.



పట్టుబడ్డ గంజాయి, నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

గల్లా ఇంటికి టీటీడీ ఛైర్మన్



తిరుపతి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు గురువారం అమరరాజ కంపెనీ వద్దగల మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఇంటికి వెళ్లారు. అరుణకుమారితో పాటు అమరరాజ గ్రూప్స్ అధినేతలు గల్లా రామచంద్ర నాయుడు, గల్లా జయదేవ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం టీటీడీ ఛైర్మన్‌ను గల్లా కుటుంబ సభ్యులు సత్కరించారు. ఇటీవల విడుదలైన గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకాన్ని బీఆర్ నాయుడు కొనుగోలు చేశారు. పుస్తకాలు అమ్మడం ద్వారా వచ్చే మొత్తాన్ని పేద విద్యార్థుల చదువు కోసం ఉపయోగించాన్న అరుణకుమారి నిర్ణయాన్ని ఆయన అభినందించారు. అనంతరం టీటీడీ పాలకమండలి సభ్యుడు ఓవీ రమణ నివాసానికి బీఆర్ నాయుడు వెళ్లి మర్యాదపూర్వకంగా పలకరించారు.

పాఠశాలల్లో విధిగా స్కౌట్, గైడ్ యూనిట్స్

విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్



తిరుపతి అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో స్కౌట్, గైడ్ యూనిట్స్ విధిగా ఏర్పాటు చేస్తామని డీఈఓ కేవీఎస్ కుమార్ అన్నారు. మంగళం జిల్లా పరిషత్ ఉన్నత ట్రెండ్స్ పాఠశాలలో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ 2024-25వ సంవత్సరంలో జిల్లాలో 1,500 పాఠశాలల్లో స్కౌట్ శాఖలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి జిల్లాలో 40పాఠశాలలకు రూ.50వేల చొప్పున సమగ్రశిక్ష ద్వారా నిధులు ఇవ్వడమే కాకుండా ప్రత్యేక కార్యచరణతో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం బేస్‌బాల్ క్యాంపు క్రీడాకారులను అభినందించారు. జిల్లా వయోజన వనరుల కమిషనర్ ఎం.ఎం.రెడ్డి, కార్యదర్శి జయరాం వార్షిక నివేదిక సమర్పించి, ఫ్లాగ్ డే స్టిక్కర్స్‌ను విడుదల చేశారు. నిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు స్కార్ఫ్ అధికారులను సత్కరించారు. మాస్టర్స్ అడ్వాన్స్ కోర్స్ చేసిన వారికి గుర్తింపు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌నాయుడు, జయరామయ్య, మునిరత్నం, వెంకటేశు, రామకృష్ణ, వెంకటాద్రి, మురళి, హేమకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్వీయూలో యువ తరంగ్

● మూడు రోజుల పాటు సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనల హోరు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు



యువతరంగ్ లోగో

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ వేదికగా శుక్రవారం నుంచి యువ తరంగ్-2024 కార్యక్రమం నిర్వహించనున్నారు. యూనివర్సిటీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల్లోని సృజనాత్మక కళలను వెలికి తీసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విజేతలను జాతీయ పోటీలకు తీసుకెళ్లనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి తదితరులు ఆవిష్కరించారు. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. వారికి అవసరమైన రవాణా, భోజనం, వసతి, వేదికలు వంటి సదుపాయాలు సిద్ధం చేసినట్టు తెలిపారు. డ్యాన్స్, మ్యూజిక్, లిటరరీ ఈవెంట్స్, థియేటర్ ఈవెంట్స్, ఫైన్ ఆర్ట్స్ ఇలా ఐదు విభాగాలుగా 27 ఉప అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే 35 కళాశాలలకు చెందిన విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం వరకూ నమోదుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు అన్నమయ్య భవన్ నుంచి మెయిన్ బిల్డింగ్, ఓల్డ్ ఎంబీఏ బిల్డింగ్, శ్రీవారి ఆలయం, పరిపాలనా భవనం మీదుగా శ్రీనివాస ఆడిటోరియం దాకా ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభిస్తారని, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శాప్ ఛైర్మన్ రవినాయుడు అతిథులుగా పాల్గొంటారన్నారు. అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కల్యాణ్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ప్రిన్సిపాళ్లు సుధారాణి (ఆర్ట్స్), రామకృష్ణారెడ్డి (సైన్స్), నరసయ్య (కామర్స్), దామోదర రెడ్డి (ఇంజినీరింగ్), డాక్టర్ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.



అర్హులందరికీ ఉచిత గ్యాస్

● వెంటనే ఈకేవైసీ చేసుకోవాలన్న జేసీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని జేసీ శుభం బన్సల్ చెప్పారు. తన చాంబరులో గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉచిత గ్యాస్ కనెక్షన్లు కోసం ఇది వరకే గ్యాస్ కనెక్షన్ కలిగి వుండాలని, ఆధార్, రేషన్ కార్డు తప్పనిసరిగా వుండాలన్నారు. ఈకేవైసీ చేయకుంటే సబ్సిడీ డబ్బులు అకౌంటులో పడవన్నారు. దీనికోసం ఆఖరు తేదీ అంటూ ఏమీ లేదని గ్యాస్ పంపిణీదారులు లబ్దిదారుల ఇళ్ల వద్దకే వచ్చి ఈకేవైసీ చేసుకుంటారని చెప్పారు. ఎవరూ గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లాల్సిన పనిలేదన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం బుక్ చేసుకోవచ్చన్నారు. ఈకేవైసీ పూర్తయిన వారికి వారి అకౌంట్లలో నగదు జమవుతుందని జేసీ పేర్కొన్నారు. వీటిపై సందేహాలుంటే 1967కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు.

జీవీఆర్ పరిశ్రమలపై ఐటీ దాడులు

కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడులోని జీవీఆర్ (సాగర్‌గ్రంధి ఎక్స్‌పోర్ట్) రొయ్యల పరిశ్రమలో గురువారం ఆదాయపన్నుశాఖ అధికారులు తనిఖీలు చేశారు. సిబ్బంది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని ఈ తనిఖీలు చేపట్టారు. ఈ రొయ్యల పరిశ్రమ మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు, భీమవరానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ది. ఈయనతో పాటు, వారి కుటుంబసభ్యులకు చెందిన 11 పరిశ్రమల్లోనూ ఆదాయ పన్నుశాఖ అధికారులు ఏకకాలంలో సోదాలు చేస్తున్నట్లు సమాచారం.

పుష్పయాగానికి నేడు అంకురార్పణ

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం జరుగనున్న పుష్పయాగానికి శుక్రవారం అంకురార్పణ జరుగనుంది. రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య అంకురార్పణ నిర్వహించి ఆచార్య రుత్విక్‌వరణం చేపట్టనున్నారు. శనివారం శ్రీవారి ఉత్సవమూర్తులను ఆలయంలోని సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగాన్ని చేపట్టనున్నారు.

హత్యాయత్నం కేసులో ఆటోడ్రైవర్ అరెస్టు



శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో మునికుమార్ అనే ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి కథనం మేరకు... శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మునికుమార్, అతడి స్నేహితుడు సతీష్‌కుమార్ ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తుంటారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో ఆగ్రహించిన మునికుమార్ కత్తి వెంటపెట్టుకుని ఈనెల 4వ తేదీన ఉదయం 4 సమయంలో సతీష్ కుమార్ ఇంటి వద్దకు వెళ్లి తలుపు కొట్టాడు. వెలుపలకు వచ్చిన సతీష్‌పై కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అడ్డువచ్చిన అతడి భార్య కీర్తన, మామ గణేష్‌లను కత్తితో గాయపరిచాడు. వారి ఫిర్యాదు సీఐ గోపి హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ముక్కంటి ఆలయ సమీపంలోని సన్నిధి వీధిలో టూరిస్టు బస్టాండు వద్ద మునికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.10 లక్షలు టోకరా

నాయుడుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.10 లక్షలు టోకరాపెట్టిన సంఘటన నాయుడుపేటలో చోటుచేసుకుంది. నాయుడుపేట-మేనకూరులోని నివాసం ఉంటున్న సాయి అనే యువకుడికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ కడపకు చెందిన యువకుడు నమ్మబలికాడు. దీంతో ఆ యువకుడికి సాయి రూ.10 లక్షలు ఇచ్చారు. ఉద్యోగం ఇప్పించక పోగా, అతడి నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో బధితుడు గురువారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 66,168 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,299 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

ఎస్వీయూకు ప్రపంచ గుర్తింపు

● క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలో మొదటి స్థానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీకి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్-2025లో 581-600 మధ్య ర్యాంకు సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీలన్నింటిలో మొదటి స్థానాన్ని పొందింది. పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, అంతర్జాతీయ సంబంధాలు తదితర అంశాల్లో ప్రమాణాలను పరిశీలించి ఈ గుర్తింపును ప్రకటించారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి షమ్మీపర్వీన్‌సుల్తానాబేగం

గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్‌సుల్తానాబేగం అన్నారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అందరూ బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. స్వేచ్ఛ పేరుతో ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా సమాజంలో మంచి పౌరులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అరవ పార్వతయ్య, కోటేశ్వరరావు, పద్మావతి, భాస్కర్‌రావు, చంద్రమోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లను రద్దు చేయాలి



గూడూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణానికి చెందిన కొందరు అగ్రకులస్తులు నకిలీ బీసీ సర్టిఫికెట్లతో చలామణి అవుతున్నారని అధికారులు విచారించి అలాంటి నకిలీ సర్టిఫికెట్లను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్యవర్గ సభ్యులు తెలిపారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్యవర్గ సభ్యులు నిరసన తెలియజేశారు. రామారావు, భాస్కర్, శంకరయ్య, శ్రీనివాసులు, సతీష్ పాల్గొన్నారు.

ప్రతిభచాటిన క్రీడాకారులకు అభినందనలు



గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అర్చరీ పోటీలలో ప్రతిభచాటిన అర్జున అర్చరీ అకాడమి క్రీడాకారులను గురువారం స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రగతి సేవాసంస్థ నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మన్యంజిల్లా జోగింపేటలో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అర్చరీ పోటీలలో అర్జున అకాడమీకి చెందిన క్రీడాకారులు లోకేష్, షణ్ముకి, తరుణీష్‌జత్య, నిషిత, శశిధర్, కిరణ్‌తేజ, భాషిత ప్రతిభచాటి మెడల్స్ సాధించారన్నారు. క్రీడాకారులతో పాటు కోచ్ శివశంకర్‌ను అభినందించారు. శ్రీనివాసులు, పూర్ణా, భాను, పెంచలయ్య, నాగరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

చెరువులా మారిన పాత జీఎన్‌టీ రోడ్



కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకే నాయుడుపేట - శ్రీకాళహస్తి పాత జీఎన్‌టీ రోడ్డులో అడుగడుగునా నీటి గుంతలు ఏర్పడ్డాయి. ఆ నీటి గుంతల్లో ఆటోలు, ఇతర వాహనాలలో ప్రయాణించడం ప్రజలకు నరకప్రాయంగా ఉంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ గుంతలో పడవలు నడపచ్చని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు.
- నాయుడుపేట

జాతీయస్థాయి క్రీడలకు కృపాప్రిన్సి


రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న కృపాప్రిన్సి

నాయుడుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడల్లో అండర్-14 బాలికల విభాగంలో చింతపల్లి కృపాప్రిన్సి మంచి ప్రతిభ కనపరిచినట్లు ఎస్ఎస్ఎఫ్ డైరెక్టర్ మామిడి లక్ష్మయ్య తెలిపారు. స్థానిక బాలభారతీలో 7వ తరగతి చదువుతున్న కృపాప్రిన్సి 600 మీటర్ల పరుగుపందెంలో 3వస్థానంలో నిలిచి క్యాంస పతకం, 4/100 రిలే పరుగుపందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించినట్లు వెల్లడించారు. కృపాప్రిన్సి జాతీయస్థాయిలో నిర్వహించే పాఠశాల క్రీడల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాహాపై విచారణ

కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కోట పరిధిలోని శ్యామసుందరపురం రేషన్ దుకాణంలో బియ్యం స్వాహాపై విచారణ జరిపినట్లు తహసీల్దారు జయజయరావు , సీఎస్‌డీటీ మల్లికార్జున్ రావులు గురువారం తెలిపారు. ఇక్కడ రేషన్ దుకాణం నడుపుతున్న పాత డీలర్‌పై 3,470 కేజీల బియ్యం స్వాహాచేశారని గ్రామస్తులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దారు, సీఎస్‌డీటీ ఆర్ఐ మధులత, వీఆర్వో రమణయ్య, శ్రీనివాసులును రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. బియ్యం స్వాహా వాస్తవమేనని నిర్ధారించారు. నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నట్లు వెల్లడించారు.

రసాయన ఎరువులతో భూమి నిర్జీవం

చిట్టమూరు, నవంబరు 7(ఆంధజ్యోతి): రసాయన ఎరువుల వినియోగంతో భూమి నిర్జీవంగా మారుతుందని జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. గురువారం ఏవో సుచేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో చిట్టమూరులో రైతులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాల్, చిట్టమూరు ఏవో సుచేంద్ర ప్రసాద్‌లు తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



గూడూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురు వారం అయ్యప ్పస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహిం చారు. స్థానిక కాశీ లేఅవుట్‌లో నూతనంగా అయ్యప్ప స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా విశేషపూజలు జరిపారు. సాయంత్రం గ్రామోత్సవం జరిపారు. రాత్రికి ఆలయంలో స్వామివారి పడిపూజ జరిపించారు.

13న పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ఓజిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచాయతీల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈనెల 13న పంచాయతీ అభివృద్ధి కోసం నిర్దేశించిన ప్రణాళికలపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, వెలుగు సిబ్బంది తదితరులు హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.




ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ కార్యాలయాన్ని చుట్టిముట్టిన నీరు, బాలికల పాఠశాల ప్రాంగణమంతా ఇలా.. ● అర్‌అండ్‌బీ బంగ్లా ప్రవేశద్వారం వద్ద

సూళ్లూరుపేటలో భారీ వర్షం

● బాలికల పాఠశాలను చుట్టుముట్టిన వర్షపునీరు

సూళ్లూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో భారీ వర్షం కురవడంతో ప్రధాన వీధులతో పాటు పలు ప్రాంతాలు జలమయంగా మారాయి. గురువారం తెల్లవారు జామున నుంచి విడితల వారీగా మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి ప్రధాన రహదారి జీఎన్టీ రోడ్డు, సాయినగర్, షార్ సర్కిల్, గురుకుల పాఠశాల రోడ్డు మార్గంలో వర్షపునీరు నిలబడడంతో పాద చారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ మంతా జయలమయంగా మారింది. బాలికల ఉన్నత పాఠశాల ముందు వర్షపునీటితో పాటు మురుగునీరు చేరడంతో ప్రాంగణమంతా మురుగుతో నిండిపోయింది. అదేవిధంగా ఆర్ అండ్‌బీ బంగ్లా, ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ కార్యాలయాలను చుట్టూ వర్షపునీరు చేరింది. అధికారులకు ఇబ్బందులు తప్పలేదు. పట్టణంలో పలుచోట్ల మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినా ప్రజలకు బాధలు తప్పడం లేదు.

పేదల సొంతింటి కల చంద్రబాబుతోనే సాధ్యం


లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

వెంకటగిరి, నవంబరు 7 : (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల నెరవేర్చడం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గుండ్రసముద్రం ఎస్సీ కాలనీలో 24 మంది లబ్ధిదారులకు 3 సెంట్ల స్థలానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లను కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరిలో అధునాతన వసతులతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో అత్యవసర చికిత్సా విభాగం భవనాన్ని అన్ని వసతులతో నిర్మించి మెరుగైన వైద్యసదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. ఎంపీపీ తనూజరెడ్డి, టీవీఎస్ చైర్మన్ స్వర్ణసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత శాతం పెంచడమే లక్ష్యం


మాట్లాడుతున్న ఏవో రఘురామయ్య

దొరవారిసత్రం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సంపూర్ణ అక్షరాస్యత శాతాన్ని పెంచడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం ప్రారంబించినట్లు ఎంపీడీవో కార్యాలయ ఏవో రఘురామయ్య తెలియజేశారు. గురువారం మండల సమావేశ మందిరంలో మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించిన వెలుగు వీవోఏలు, ఉల్లాస్ కార్యక్రమం నిర్వాహక వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గతంలో అక్షరాస్యత, అక్షర దీపం కార్యక్రమాలతో ప్రతి ఇంటా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని చేపట్టిన కార్యక్రమమే ఉల్లాస్ అని తెలిపారు. మండలంలో మొదట విడతగా పొదుపు మహిళా సంఘాల ద్వారా ఇప్పటికే గుర్తించిన 370 మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. వయసుతో సంబందం లేకుండ చదువు ఎలా నేర్పించాలనే అంశాలపై ఎంఈవో క్రిష్ణయ్య వారికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మునిరాజ, సీసీ పాల్గొన్నారు.

ఓజిలి రైతులకు గంగనీరు అందించండి


ఎమ్మెల్యే విజయశ్రీతో మాట్లాడుతున్న విజయకుమార్ నాయుడు

ఓజిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండల రైతాంగానికి తెలుగు గంగ ద్వారా సాగునీటిని అందించాలని టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్‌నాయుడు గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని కోరారు. గురువారం సూళ్లూరుపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యేని కలిశారు. మండలంలో ఈ పాటికే సాగు చేపట్టాల్సిన రైతాంగం సరైన వర్షాలు పడకపోవడంతో నార్లు పోసుకోకుండా ఉన్నారని అన్నారు. ఈ క్రమంలో మండలంలోని చెరువులకు గంగనీటిని విడుదల చేస్తే రైతులు నార్లు పోసుకుని సాగుచేడతారని ఆయన తెలిపారు. గంగ అధికారులతో మాట్లాడి ఓజిలి మండలానికి నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నైపుణ్య అభివృద్ధి సర్వేపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

దొరవారిసత్రం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఇంటింటా నైపుణ్య అభివృద్ధి సర్వేపై గురువారం దొరవారిసత్రం మండల కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులకు శిక్షణ జరిగింది. ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబంలో సభ్యుల వివరాలు, నిరుద్యోగ యువత వివరాలు, వారికి ఎటు వంటి శిక్షణ ఇస్తే, ఉద్యోగం లభిస్తుంది వంటి అంశాలపై సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ సర్వే చేసే విధానంపై శ్రీసిటీలోని స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ మేనేజర్ మురళి గ్రామ సచి వాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శిలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో రఘురామయ్య పాల్గొన్నారు.

బదిలీ అయిన వీఆర్వోకు ఘనసన్మానం

పెళ్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారంపేట వీఆర్వోగా విధులు నిర్వహించి బదిలీపై గూడూరు వీఆర్వోగా వెళ్లిన రవిచంద్రను గురువారం రెవిన్యూ అధికారులు సన్మానించారు. పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ యువరాజు ఆర్ఐ సంతోషీబాయి, వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణ, సుధాకర్ తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు తేజ, కళ్యాణి, సుమతి తదితరులు ఉన్నారు.

ఎరువులు అవసరమైన మేరకే వినియోగించాలి


మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మి

సూళ్లూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను వాడాలని జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకులు లక్ష్మి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాల యంలో గురువారం సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధి లోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందదిన వ్యవసాయాధి కారులకు నైపుణ్యత పెంపుదల మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంబడి ద్వారా అన్ని గ్రామాల్లో రైతులకు పంటల సాగులో ఎరువులు వినియోగం తదితర అంశాల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల న్నారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఎల్లప్పుడూ గ్రామ విస్తరణాధి కారులు అందుబాటులో ఉండాలన్నారు. తెగుళ్ల సోకకుండా ఉండేందుకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించేలా అధికారులు ప్రత్యేక చొరవతీసుకోవాలని ఏవో శశిధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఏడీఏ అనిత, ఏవోలు కవిత, కాంచన, జ్యోతిర్మయి, విస్తరణాధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక విద్యార్థులతో నోరు, రొమ్ము, సర్వేకల్ క్యాన్సర్‌లపై అవగాహన కల్పించారు. హెచ్‌ఈవో పెంచులయ్య, డివిజన్ ఎస్ఈవో రామరాజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం కేశవరంలో జ్వరాలపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్


సురేష్‌బాబుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేష్ బాబుకు అనంతరపురంలో ఎస్కే యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ గీతాంజలి పర్యవేక్షణలో యాన్ ఎన్‌యాంసెడ్ ఎనర్జీ ఆర్టిమైడేషన్ ట్రస్టు మోడల్ ఫర్ వింప్రోవైసింగ్ ది లైఫ్‌టైమ్ ట్రూ హురిటిక్ట్ అప్రోసెస్ ఆన్ వైర్‌లైస్ సెన్సార్ నెట్‌వర్క్' అనే అంశంపై సురేష్‌బాబు పరిశోధనలు చేశారు. ఈ క్రమంలో ఆయనకు వర్శిటీ డాక్టరేట్ అందించింది. దీంతో గురువారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నారాయణ రావులు సురేష్‌బాబును అభినందించారు.

గంగమ్మ ఆలయంలో కుంభాభిషేకాలు

కోట: మండలంలోని వెంకన్నపాళెం గ్రామ దేవత గంగమ్మతల్లి ఆలయ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మహా కుంభాభిషేకాలు జరిగాయి. అమ్మవారి ఉత్స వర్లను పురవీధుల్లో ఊరేగించారు. అమ్మ వారి జీవిత చరిత్రను కథకులు వివరించారు.

డిప్యూటీ సీఎంను కలసిన బంగారంపేట సర్పంచ్

పెళ్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను గురువారం అమరావతిలో బంగారంపేట సర్పంచ్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి నాగేంద్రప్రసాద్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేద్దాం

చిల్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయని టీడీపీ మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిరక్షరాస్యులకు విద్యను బోధించే వలంటీర్లుకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రధానకార్యదర్శి నెలటూరు చిరంజీవి, అటల్ ఎడ్యుకేషన్ ఏపీవో ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో గోపి, ఏపీఎం రత్నయ్య, ఎంఈవో రఫూఫ్, సీసీలు పాల్గొన్నారు.

గూడూరులో ఓ మోస్తరు వర్షం

గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. అరగంటపాటు వర్షం కురవడంతో పలు చోట్ల రోడ్లుపై వర్షపునీరు నిల్వచేరింది. పాద చారులు, వాహనదారులు అవస్థలుపడ్డారు.

పుత్తూరు వార్తలు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. గురువారం ఆయన మండలంలోని పాలమంగళం దక్షిణ గ్రామంలో ప్రభుత్వం రాయితీపై అందించే వేరుశనగ, మినుము విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ విత్తనాలను 40 శాతం రాయితీపై అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజు రైతులకు అందించే ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి, ఇంచార్జి ఎంపీడీవో గుణశేఖర్, ఈవో శోభారాణి, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అమెరికాలో వ్యాపారవేత్తలు కావడం గొప్ప విషయం

● ఎమ్మెల్యే భానుప్రకాష్



పుత్తూరు అర్బన్, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): అమెరికాలో తెలుగు వారు వ్యాపారవేత్తలుగా ఎదుగుతుండటం హర్షణీయమని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన లోవా స్టేట్‌లో చిత్తూరు జిల్లాకు చెందిన ప్రవాసాంధ్రులు ఏర్పాటు చేసిన గ్రోసరీ స్టోర్ ఇండియా మార్ట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు ఆరి విద్యాధరి, సురేఖ, రంజిత్, కవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో 14 మి.మీ వర్షపాతం నమోదు


భవానీ నగర్‌లో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

పుత్తూరు అర్బన్, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించింది. గురువారం వేకువ జాము నుంచి కురిసిన వర్షానికి మురుగు కాలువలు పొంగి రోడ్లపైకి ప్రవహించాయి. పట్టణ పరిధిలో 14 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గేటు పుత్తూరు పరిధిలోని ఆనంబట్టు రోడ్డు, భవానీ నగర్ తదితర లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై మోకాలు లోతు వర్షపు నీరు నిలిచిపోయింది. కమిషనర్ మంజునాథ్ గౌడ్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది ఆయా కాలనీల్లో మురుగునీరు రోడ్లపైకి రాకుండా చర్యలు చేపట్టారు.

ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ అదుపు

పుత్తూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలు, అవగాహనతో క్యాన్సర్ వ్యాధిని అదుపు చేయవచ్చని పుత్తూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ మగవారిలో ఊపిరి తిత్తులు, మహిళల్లో వక్షోజాల క్యాన్సర్ ఎక్కువగా వస్తోందని చెప్పారు. అధ్యాపకులు వీరయ్య, శాంసన్‌రాజు, వెంకటకృష్ణయ్య, షర్మిల పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని మరో చోటుకు మార్చండి

పుత్తూరు టౌన్, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న మద్యం దుకాణాన్ని మరొక చోటుకు మార్చాలని సీపీఎం జిల్లా నాయకులు వెంకటేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ బుధవారం ఇదే విషయంపై ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. మద్యం దుకాణం రెండు వైపులా ఎల్ఐసీ కార్యాలయం, గెస్ట్ హౌస్, కోర్టు ఉన్నాయని తెలిపారు. ప్రైవేటు కళాశాల కూడా ఉండటంతో విద్యార్థులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వారు చెప్పారు.

శివశివా.. ఆ లెక్కల గుట్టు విప్పవా?

- శివరాత్రి జమా ఖర్చులపై విచారణకు భక్తుల డిమాండ్
- నాటి ఈవోపై విమర్శలు


సదాశివ కోన

వడమాలపేట, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): సదాశివకోనలో గత శివరాత్రి ఉత్సవాల జమా ఖర్చుల గోల్‌మాల్‌లో ఈవో రామచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవడంలో దేవదాయ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని భక్తులు విమర్శిస్తున్నారు. సుమారు రూ.5 లక్షల మేర స్వాహా చేశారని ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టలేదని వాపోతున్నారు. మార్చి 8న శివరాత్రి సందర్భంగా వచ్చిన ఆదాయంపై నెల రోజుల్లోగా మహాజనసభ ద్వారా దేవదాయ అధికారులు జమా ఖర్చులు తెలిపాల్సి ఉంది. అప్పటి ఈవో రామచంద్రారెడ్డి నాలుగు నెలల తరువాత ఆ వివరాలను ప్రకటించారు. రూ.13,29,639 ఆదాయంరాగా రూ.10,31,670 వ్యయం చేసినట్లుగా లెక్కలు చూపారు. గతంలో ఏడాదికి సుమారు రూ.4 లక్షలు ఖర్చయ్యేవని, కానీ ఈఏడాది భారీగా ఖర్చు చూపడంతో భక్తులు ఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జూలై 14న 'శివుడి సొమ్మును దుర్వినియోగం చేస్తారా' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీంతో వడమాలపేట, ఏర్పేడు, పుత్తూరు మండలాలకు చెందిన శివ భక్తులు దేవదాయ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆలయ చైర్మన్ అనుమతితోనే ఖర్చు చేసినట్లు ఈవో పేర్కొన్నారు. తనకు తెలియకనే ఈవో జమా ఖర్చులు చూపారని చైర్మన్ మీడియా సమావేశంలో ఖండించారు. అలాగే కొన్నేళ్లుగా రాష్ట్రంతో పాటు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల భక్తులు అందించిన కానుకలు కూడా కనిపించకుండా పోయాయని భక్తులు ఆరోపిస్తున్నారు. సదాశివకోన అన్నదాన సమాజం, శివ భక్తుల ఆధ్వర్యంలో అప్పటి ఈవో రామచంద్రారెడ్డి సమక్షంలో వ్యయం లెక్కలపై బహిరంగంగా విచారణ నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

పాలకవర్గాన్ని నియమించాలి

దేవస్థానం నూతన పాలకవర్గాన్ని నియమించాలని భక్తులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా వైసీపీ ప్రభుత్వంలోని పాలకవర్గమే కొనసాగుతోంది. మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కొత్త పాలకవర్గాన్ని నియమించాలని శివభక్తులు కోరుతున్నారు.

గోతులమయంగా జీఎన్‌టీ రోడ్

సూళ్లూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్ అధ్వానంగా మారింది. గురువారం తెల్లవారు జామున నుంచి కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై వర్షపునీరు నిలవడంతో ఉన్న చిన్నగోతులు పెద్దవిగా మారడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. స్థానిక హోలీక్రాస్ కూడలి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు దాదాపు కిలో మీ టరు మేర పట్టణ ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. గత ప్రభుత్వ హయాం లో గోతులు పూడ్చకపోవడంతో ఐదేళ్ల నిర్లక్ష్యానికి జీఎన్‌టీ ప్రధాన రోడ్డు ప్రయాణికులకు నరకాన్ని చూపుతోంది. కూట మి ప్రభుత్వం రావడంతో రోడ్డుకు మోక్షం కలుగుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోడ్డు ఇలా.. ● ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సమీపంలో నడిరోడ్డు పై ఏర్పడిన గుంత

రూ.16.58 కోట్లతో అభివృద్ధి పనులు

- టీడీపీ నేతలకే పనుల అప్పగింత
- ఎమ్మెల్యే ఆదిమూలం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో సత్యవేడు నియోజకవర్గంలో రూ.16.58 కోట్లతో మంజూరైన పలు అభివృద్ధి పనుల ప్రారంభించినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం వెల్లడించారు. గురువారం పిచ్చాటూరు టీడీపీ కార్యాలయంలో అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులన్నీ టీడీపీ నేతలు, కార్యకర్తలకు కేటాయించామని తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 200 మినీ గోకులం షెడ్ల పనులు మంజూరయ్యాయని చెప్పారు. పిచ్చాటూరు మండలంలోని ముడియూరు, సత్యవేడు మండలం వమర్తికండ్రిగలో విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.14.48 కోట్లతో గ్రామీణ రహదారులకు బ్రిడ్జి నిర్మాణాలు, ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.2.10 కోట్లతో పనులకు టెండర్లు జరుగుతున్నాయి. రూ.44కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయన్నారు. టీడీపీ నేతలకు పనులు దక్కలేదన్న ఆందోళన వద్దని, తను సంప్రదిస్తే మళ్లీ కొత్త పనులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ నెలలోనే చెరువు ఆయకట్టు ఎన్నికలు జరుగుతాయని, తద్వారా మరిన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసుకుందామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇలంగోవన్‌రెడ్డి, నాయకులు వద్దిరాజు, గోవిందస్వామి, జయచంద్ర నాయుడు, వాసురెడ్డి, దిలీ, చిన్న, మునిశేఖర్‌రెడ్డి, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ రాధమ్మ

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వ్యాపారాల్లో మరింత పురోగతి సాధించాలని మెప్మా పీడీ రాధమ్మ పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు కొత్త మొబైల్ యాప్‌ను తీసుకొచ్చారని చెప్పారు. ఈ యాప్‌ను ఉపయోగించడం ద్వారా స్వయం సహాయక సంఘాల ద్వారా చేసే ఉత్పత్తులను సులభంగా విక్రయించుకోవచ్చని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, మెప్మా సీఎంఎం జయరాం, సీవోలు దివాకర్, విష్ణు, స్వాతి పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అప్రమత్తతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. శ్రీకాళహస్తి మండలం కాపు గున్నేరులోని స్విమ్స్ కళాశాలలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రోజురోజుకీ సైబర్ నేరాలు కొత్త కొత్త రూపంలో జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు సైబర్ నేరగాళ్ల మోసాలను గమనిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. స్మార్ట్ ఫోన్‌ను జీవన ఉన్నతికి వాడుకోవాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్టులు, రుణాల పేరుతో దగా చేసే లోన్ యాప్స్, పార్సిల్ మోసాలు, నకిలీ వాయిస్, పార్వర్డ్ మెసేజ్ మోసాలు, క్రెడిట్, ఏటీఎం కార్డు ద్వారా జరిగే మోసాలు, డిజిటల్ ఫుట్ ప్రింట్, ఆఫర్ల పేరుతో మొబైల్‌కు వచ్చే వెబ్‌సైట్ల లింకులు వంటి మోసాలపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ మిద్దెల హరి, రూరల్ సీఐ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

సత్యవేడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనని శ్రీసిటీ డీఎస్పీ సైతేశ్వరరావు స్పష్టం చేశారు. శ్రీసిటీలోని డీఎస్పీ కార్యాలయంలో గురువారం శ్రీసిటీ పరిధిలోని వాహన యజమానులు, డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పరిశ్రమలకు కార్మికులను తరలిస్తున్న వాహనాలు అధిక వేగంతో ఓవర్ టేక్ చేయరాదని సూచించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేస్తామని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ హరిప్రసాద్, శ్రీసిటీ సెక్యూరిటీ జనరల్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే జీవితాలు నాశనం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మత్తుకు బానిసైతే జీవితాలు నాశనం అవుతాయని సీఐ తిమ్మయ్య తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీనివాసతేజ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, అలవాటు పడితే జీవితం సర్వనాశనమవుతుందన్నారు. మహిళలపై అత్యాచారాలు, సైబర్ నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ డ్రగ్స్ వాడినా, విక్రయించినా పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు.

చంద్రబాబు అభివృద్ధికి ప్రతిరూపం: ఎమ్మెల్యే బొజ్జల

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి పాలనకు ప్రతిరూపమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మండలంలోని తూకివాకంలో విద్యుత్ సమస్య పరిష్కారంకోసం రూ.7.7కోట్లతో సీఎం చంద్రబాబు వర్చువల్ విధానం ద్వారా గురువారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల తరపున చంద్రబాబుకు ఒక ప్రకటన ద్వారా ధన్యవాదాలు తెలిపారు.

పూర్ణాహుతి సమర్పణ


పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికార నంది బాలాలయ పూజల్లో భాగంగా పూర్ణాహుతి సమర్పణ కార్యక్రమం జరిగింది. ఆలయంలోని 16 కాళ్ల మండపంలో బుధవారం కలశ స్థాపనతో బాలాలయ పూజలకు అంకురార్పణ చేయగా, గురువారం విశేష పూజలు, హోమం నిర్వహించారు. వేదోక్తంగా దేవతలకు పూర్ణాహుతి సమర్పించారు. ఈఈ మురళీధర్ రెడ్డి, సీఎస్‌ఓ నాగభూషణం యాదవ్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో మోస్తరు వర్షం


పురపాలక కార్యాలయం వద్ద లోతట్టు ప్రాంతాలకు నీరు చేరకుండా అడ్డుకట్ట వేసిన అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో అల్పపీడన వాతావరణంతో గురువారం మోస్తరు వర్షం కురిసింది. వేకువ జాము నుంచి రాత్రి వరకు అడపాదడపా జోరు వాన కురిసింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మురుగునీటి వ్యవస్థలను ముందుగానే శుభ్రం చేశారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం కార్యాలయం వద్ద ఉన్న ఎంఎం వాడ ప్రాంతానికి నీరు చేరకుండా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. రోడ్లు బురదమయంగా మారింది. ముక్కంటి ఆలయం నుంచి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులు కొండ చుట్టూ ఊరేగే మార్గం తెలిసిందే. ఏడాదికి రెండుసార్లు స్వామి అమ్మ వార్లు సంచరించే ఈ మార్గాన్ని భక్తుల ఎంతో పవిత్రంగా భావిస్తారు. ప్రతి నెల పౌర్ణమి తిథి రోజున భక్తులు భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ చేస్తుంటారు. పట్టణంలోని కైలాసగిరి కాలనీ నుంచి వేయిలింగాలకోన వరకు సిమెంటు రోడ్డు నిర్మించారు. అక్కడినుంచి ముక్కంటి ఆలయ సమీపంలోని తుఫాన్ సెంటర్ వరకు మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో మట్టి రోడ్డు బురద మయంగా మారింది. దీనిని బాగు చేయాలని భక్తులు కోరుతున్నారు.

బురదమయంగా గిరి ప్రదక్షిణ రోడ్డు

శివపార్వతుల కైలాసగిరి ప్రదక్షిణ జరిగే


కొండ చుట్టు రోడ్డులో బురద

అవగాహనతోనే క్యాన్సర్ మహమ్మారి అదుపు


క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే క్యాన్సర్ మహమ్మారిని అదుపు చేయగలమని శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని కళాశాలలో గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతికి చెందినవే ఫౌండేషన్, టాటా ట్రస్టు క్యాన్సర్ సంస్థల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. ముందుగా క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టారు. అనంతరం విద్యార్థులకు టాటా ట్రస్టు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైడి అంకయ్య, ట్రస్టు వైద్యులు డాక్టర్ వెంకయ్య బాబు, సభ్యులు హేమంత్ రెడ్డి కుమారి అమరావతి మహేంద్ర పాల్గొన్నారు. బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి దివాకర్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు. వరదయ్యపాళెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఉదయ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ద్వైత, మధుసూదన్, సిబ్బంది తులశమ్మ, జయలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ స్ఫూర్తి ఆదర్శనీయం


అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తుది శ్వాస వరకు నిస్వార్థంగా పేదల ఆకలి తీర్చిన డొక్కా సీతమ్మ స్ఫూర్తి ఆదర్శనీయమని జనసేన నాయకులు చంద్రశేఖర్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ కూడలి వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు 17వ వారం డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండలం ఇన్‌చార్జి పేట చంద్రశేఖర్, నాయకులు చిరంజీవి, లక్ష్మణ్, హేమంత్ కుమార్, తేజ పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

రేణిగుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తారకరామా నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల జరిగిన చోరీ కేసులో దొంగను గురువారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఇటీవల చోరీకి వచ్చిన దొంగ పాఠశాలలో సామగ్రిని ధ్వంసం చేసి సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం కలిగించారు. దాంతోపాటు బీరువాలో దాచిన కొంత నగదుతోపాటు విలువైన వస్తువులను దోచుకెళ్లాడు. ఈ విషయమై కేసు నమోదు చేసిన పోలీసులు వేలిముద్రల ఆధారంగా శ్రీకాళహస్తికి చెందిన గౌస్‌బాషాను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 14రోజులు రిమాండ్ విధించినట్లు స్టేషన్ రైటర్ కృష్ణమూర్తి తెలిపారు.

ఆదర్శ పాఠశాల వద్ద భద్రత ఏర్పాటు చేయండి

కేవీబీపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వద్ద ఆకతాయిల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయని ఎస్ఎంసీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి ఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆకతాయిలు బైకులు తీసుకొని బాలికలను ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పాఠశాల వద్ద పోలీస్ భద్రతను ఏర్పాటుచేయాలని వినతిపత్రంలో తెలిపారు.

నైపుణ్య గణన శిక్షణ తరగతులు ప్రారంభం

రేణిగుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇంటింటా నైపుణ్య గణన నిర్వహణకు సంబంధించి మండల స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సర్వే నిర్వహణ, డిజిటల్ అసిస్టెంట్ పలు అంశాలకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఈవోపీఆర్డీ ప్రభువర్మ, ఏవో పిచ్చిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా స్కంద షష్టి

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్కంద షష్టి గురువారం వేడుకగా జరిగింది. ముక్కంటి ఆలయంలోని సరస్వతి తీర్థం వద్ద వెలసిన వళ్లీ దేవసేన సమేత చెంగల్వరాయ స్వామికి స్కంద షష్టి విశేష దినాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంకార మండపంలో ఉత్సవమూర్తులను అలంకరించి హారతులు సమర్పించారు. అనంతరం చతుర్మాడ వీధుల్లో నగరోత్సవం నిర్వహించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

సత్యవేడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.

గవర్నర్‌చే అవార్డు స్వీకరణ


అవార్డు అందుకుంటున్న శ్రీనివాసులు


శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన శ్రీనివాసులు అనే విద్యార్థి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రాజ్య పురస్కార్ అవార్డును అందుకున్నారు. పట్టణంలోని బాబు అగ్రహారం స్కూల్లో 10వ తరగతి చదువుతున్న శ్రీనివాసులు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి రాజ్య పురస్కార్ భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన పదిమంది విద్యార్థులకు గురువారం విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన శ్రీనివాసులు అవార్డును స్వీకరించారు. స్కౌట్స్ రాష్ట్ర ముఖ్య కమిషనర్ విజయరామరాజు, కార్యదర్శి మేరీ చంద్రిక, శ్రీకాళహస్తి స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు గంగమ్మల ఆలయ కుంభాభిషేకానికి అంకురార్పణ



శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడి వీధిలో వెలసిన ఏడు గంగమ్మల ఆలయ కుంభాభిషేక మహోత్సవానికి గురువారం వేదోక్తంగా అంకురార్పణ జరిగింది. ముందుగా ముక్కంటి ఆలయ వేద పండితులు ఏడు గంగమ్మల దేవాలయాన్ని మంత్రజలంతో శుద్ధి చేశారు. మూలమూర్తి ప్రతిష్ఠాపన, విమాన గోపురంపై స్వర్ణకలశ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జరగబోయే కుంభాభిషేక మహోత్సవానికి దేశకాల సంకీర్తనతో కలశ స్థాపన చేసి సంకల్ప పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, అధికారులు, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశించిన ఆకాశదీపం


ఆకాశ దీపం, చంద్ర వంక (ఇన్‌సెట్‌లో) ఆకాశ దీపం

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆకాశదీపం తేజోమయంగా ప్రకాశించింది. కార్తీక మాసం పురస్కరించుకుని ఆలయంలోని పనస చెట్టు వద్ద గురువారం సాయంత్రం ప్రదోషవేళ ఆకాశదీపాన్ని వెలిగించారు. ముందుగా దీప జ్యోతిని వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల శివనామస్మరణ మధ్య పైకి ఎగురవేశారు. నెల వంక ఆ పక్కనే ఆకాశదీపం రెండూ కలిపి దర్శనం ఇవ్వడంతో భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లోకేష్ రెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సులభతరంగా సామాన్యులకు శ్రీవారి దర్శనం


టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో మాట్లాడుతున్న ఎస్సీవీ నాయుడు

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సులభతరంగా సామాన్యులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు కోరారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూను మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, టీడీపీ నాయకులు తిరుమలలో గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు వారికి ముక్కంటి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ తిరుపతి పార్లమెంట్ రైతు విభాగ అధ్యక్షుడు తక్కెలపాటి ప్రకాష్ నాయుడు, గోగినేని భాస్కర్ నాయుడు, గోగినేని సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడు సురేష్‌ను సత్కరిస్తున్న డీఈవో

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న సురేష్ సేవలను డీఈవో కేవీఎన్ కుమార్ ప్రశంసించారు. తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. సృజనాత్మక ఆలోచనతో శ్రీకాళహస్తి మండలం ఊరందూరుకు చెందిన ఉపాధ్యాయుడు సురేష్ సాంకేతిక విధానంతో పిల్లలను తన పాఠ్యాంశాలను కొనియాడారు. అనంతరం ఆయనను శేష వస్త్రంతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల బోర్డు సెక్రటరీ వంశీ రాజా, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ నీలకంఠ, జిల్లా ఆంగ్ల రిసోర్స్ పర్సన్ భాగ్య రేఖ, గణిత రిసోర్స్ పర్సన్ మురళి, తెలుగు రిసోర్స్ పర్సన్ కిట్టన్న తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి జీవశాస్త్ర స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

పిచ్చాటూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి విద్యార్థులకు జీవ శాస్త్ర స్టడీ మెటీరియల్‌ను డీఈవో కేవీఎన్ కుమార్‌తో కలిసి జిల్లా జీవశాస్త్ర ఫోరం అధ్యక్షుడు కామాక్షయ్య గురువారం జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సులభంగా అర్థమయ్యే రీతిలో ఆంధ్రప్రదేశ్ జీవశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో తయారు చేయబడిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి వసుంధర, కోశాధికారి హరిశంకర్, విద్య విషయక నిపుణుడు నీలకంఠయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, దొరస్వామి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

నృత్యం నయనానందకరం


నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జరిగిన కార్తీక నృత్య ప్రదర్శనలు భక్తులకు నయనానందకరం కలిగించాయి. కార్తీక మాసం పురస్కరించుకొని ఆలయంలోని రెండో గేటు వద్ద గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. తిరుపతికి చెందిన నటరాజ నృత్య కళాక్షేత్రం సభ్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ అధికారులు కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

వరదయ్యపాళెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10, 23, 24 తేదీలలో జరుగనున్న ఓటర్ల నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీటీ వెంకటసుబ్బయ్య బీఎల్‌వోలను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో ఓటర్ల నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో సంబంధిత బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని తెలిపారు.

ఉల్లాస్‌తో అక్షరాస్యులుగా నిరక్షరాస్యులు

సత్యవేడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నవభారత్ ఉల్లాస్‌లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఉల్లాస్ కార్యక్రమానికి నియమితులైన వలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 45 ఉల్లాస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో పదిమంది నిరక్ష రాస్యులకు ఒక వలంటీర్ టీచర్‌ను నియమించినట్లు వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం చలపతి, ఎంఈవో రవి, ఎంఈవో 2 ఉష, రిసోర్స్ పర్సన్ బాలాజీ, వెలుగు కోఆర్డినేటర్ వాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌పై వలంటీర్ టీచర్లకు శిక్షణ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో త్రివిక్రమారావు ఆధ్వర్యంలో నవభారత్ ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్ టీచర్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యతను రూపుమాపాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ముందుకు వచ్చిన వలంటీర్ టీచర్లకు ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంలు శిక్షణ ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం మునెమ్మ, సీసీలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టడం హర్షణీయం

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు బుచ్చినాయుడు కండ్రిగ సీఐ తిమ్మయ్య ప్రత్యేక దృష్టి సారించడం హర్షణీయమని తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షుడు గాలి మురళి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తొట్టంబేడు మండలం పెన్నలపాడు వద్ద సీఐ పర్యటించి 15 ఇసుక ట్రాక్టర్లకు జరిమానా విధించడం సంతోషకరమన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు పెన్నలపాడు మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సీఐ తీసుకున్న చర్యలకు మురళి నాయుడు ధన్యవాదాలు తెలిపారు.